ప్రజాశక్తి

సోమవారం 25 డిసెంబర్ 2023 | 8 పేజీలు

ఎన్‌టిఆర్ | కృష్ణా

తుది దశకు ఎన్యుమరేషన్

- ఎన్టీఆర్ జిల్లాలో 12,155 హెక్టార్లలో పంట నష్టం
- 19,851 మంది రైతులకు కన్నీరు మిగిల్చిన మిచౌంగ్
- క్షేత్రస్థాయిలో పంట నష్టం నమోదు పూర్తి
- నాలుగు రోజుల్లో పూర్తి స్థాయిలో నివేదిక

మిచౌంగ్ తుపానుకు నీట మునిగిన వరి (ఫైల్)

ప్రజాశక్తి-విజయవాడ ప్రతినిధి

ఇటీవల బీభత్సం సృష్టించిన మిచౌంగ్ తుపాను ప్రభావంతో దెబ్బదిన్న పంట నష్టం లెక్కింపు ప్రక్రియ తుది అంకానికి చేరుకుంది. ఎన్టీఆర్ జిల్లాలో మిచౌంగ్ వల్ల వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. క్షేత్ర స్థాయిలో గ్రామాలు, మండలాలు వారీగా చేపట్టిన పంట నష్టం గుర్తింపు పూర్తి కాగా ఆ మొత్తాన్ని క్రోడీకరించే పనిలో వ్యవసాయ శాఖ అధికారులు నిమగ్నమై ఉన్నారు. మరో మూడు నాలుగు రోజుల్లో ఒక కొలిక్కి రానుంది. తుది రిపోర్టు రూపొందించిన తర్వాత ప్రభుత్వానికి నివేదించనున్నారు. అనంతరం నష్ట పరిహారం చెల్లించనున్నారు. దాదాపు 12 రోజుల పాటు ఎన్యుమరేషన్ చేపట్టారు. గ్రామ కార్యదర్శులు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, విఆర్ఓలు, ఇరత వ్యవసాయ, రెవిన్యూ శాఖల అధికారుల సమక్షంలో వర్షాలు నీట మునిగిన పంటలతో పాటుగా ఈదురు గాలులకు నేల వాలిన వివిధ పంటలను లెక్కింపు చేపట్టారు. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు దాదాపు 12,155 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. అన్ని ప్రాంతాల్లో కలిపి సుమారు 19,851 మంది రైతన్నలకు నష్ట పోయినట్లు గుర్తించారని తెలిసింది. అయితే దెబ్బతిన్న వాటిల్లో అధిక శాతం వరికే పంటనష్టం వాటిల్లినట్లు అధికారులు చెబుతున్నారు. దాదాపు 95 శాతం వరి పొలాలే నీట మునగడంతో పాటు నేలవాలినట్లు చెబుతున్నారు. ఆ తర్వాత (మిగతా 6లో)

గన్నవరంలో హరిదాసు వేషంలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

పండుగ వేళా... నిరసనల హోరు

కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో 13వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె

సమస్యలు పరిష్కరించాలని, సిఎం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె ఆదివారం 13వరోజుకు చేరుకుంది. క్రిస్మస్ పండుగ నేపథ్యంలోనూ కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో నిరసన కార్యక్రమాలు కొనసాగాయి. అంగన్‌వాడీలకు మద్దతుగా పలుచోట్ల ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ... వార్తలు లోపలి పేజీల్లో

అంగన్‌వాడీలకు మద్దతుగా విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ

క్రిస్మస్‌కు చర్చిలు ముస్తాబు

సెయింట్ కతెడ్రల్ చర్చిలో ఏసు పుట్టుక ప్రత్యేక ప్రార్థన నిర్వహిస్తున్న విజయవాడ బిషప్ రాజారావు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: క్రిస్మస్ వేడుకలకు కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాలోని చర్చిలు ముస్తాబయ్యాయి. అన్ని ప్రార్థనా మందిరాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా తీర్చిదిద్దారు. ఆదివారం రాత్రి నుంచి ప్రార్థనలు నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాటు చేశారు. క్రైస్తవులు తమ ఇంటిపై నక్షత్రం ఆకారం ఉన్న విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. మార్కెట్లో క్రిస్మస్ సామాగ్రి విక్రయించేందుకు ప్రత్యేకంగా దుకాణాలు వెలిశాయి. బట్టలు, సామాగ్రి దుకాణాల్లో కొనుగోలుదారుల సందడి నెలకొంది. విజయవాడలోని గుణదల మేరిమాత ఆలయం చర్చి, బెంజిసర్కిల్ వద్ద గల సెంట్ కతెడ్రల్ చర్చి, వన్‌టౌన్‌లోని చర్చితో పాలు పలు చోట్ల ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముఖ్యంగా చర్చిల వద్ద ఏసు పుట్టుక తెలియచేసే విధంగా ప్రత్యేకంగా పశువుల కొట్టాయం సెట్టింగ్‌తో పాటు ఏసు ప్రభువు పుట్టుకనే తెలియచేసే విధంగా వివిధ ఆకృతులతో ప్రత్యేకంగా అలంకరించారు. బెంజిసర్కిల్ వద్ద గల సెయింట్ కతెడ్రల్ చర్చి వద్ద ఆదివారం రాత్రి విజయవాడ కతోలిక పీఠం బిషప్ జోసఫ్ రాజారావు, (మిగతా 6లో)

గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత

- 335 మందికి రూ.2.13 కోట్ల ఆర్థిక సాయం
- గిరిజన సంక్షేమ, సాధికారిత కృష్ణాజిల్లా అధికారి ఫణిదూర్జటి

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన గిరిజనుల సంక్షేమానికి, అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు గిరిజన సంక్షేమ, సాధికారిత కృష్ణాజిల్లా అధికారి ఎం.ఫణిదూర్జటి తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 335 మంది ఎస్‌టి లబ్ధిదారులకు కృష్ణాజిల్లాలో రూ.2.13 కోట్ల వరకు ఆర్థిక సాయం అందించినట్లు చెప్పారు. గృహ నిర్మాణాలు, మరమ్మతులకు లక్షలాది రూపాయలు నిధులు అందించడం జరిగిందన్నారు. ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి గిరిజన కుటుంబాలకు ఆధార్ కార్డులు అందించామని పేర్కొన్నారు. 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో గిరిజనుల విద్య, ఆర్థిక సామాజిక అభివృద్ధికి జిల్లాలో జరుగుతున్న ప్రత్యేక కృషిని ఆయన వివరించారు.

ప్రశ్న: కృష్ణాజిల్లాలో ఎస్‌టిల సంఖ్య ఎంత?

జిల్లా జనాభాలో గిరిజనుల సంఖ్య స్వల్పంగానే ఉంది. 2011 జనాభా గణాంకాల ప్రకారం జిల్లాలో 37.35 లక్షల మందికిపైగా జనాభా ఉన్నారు. వీరిలో కేవలం 38 వేల మంది మాత్రమే గిరిజనులు ఉన్నారు.

ప్రశ్న: ఎస్‌టిల్లో అక్షరాస్యత పెంపునకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

38 వేల గిరిజన జనాభాలో 9,400 మంది నిరక్షరాస్యులున్నారు. గిరిజనుల్లో అక్షరాస్యత పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చుతున్నాం. నూరుశాతం గిరిజన పిల్లలను పాఠశాలల్లో చేర్పిస్తున్నాం. జగనన్న గోరుముద్ద అందిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే గిరిజన విద్యార్థులకు అమ్మ ఒడి పథకం అందిస్తున్నారు. ప్రభుత్వం 300 సీట్లతో ఉయ్యూరులో గిరిజన గురుకుల పాఠశాల ఏర్పాటు చేసింది. 120 మంది విద్యార్థులు చదువుతున్నారు. మిడ్‌డే మీల్స్, అంగన్‌వాడీ కేంద్రాల్లో (మిగతా 6లో)



13వ రోజుకు అంగన్వాడీల సమ్మె

మద్దతుగా పలుచోట్ల కొవ్వొత్తుల ర్యాలీ

విజయవాడ

ప్రజాశక్తి - విజయవాడ : అంగన్‌వాడీలు క్యాండిల్స్ వెలుతురులో ఆయా కేంద్రాల్లో పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. అంగన్‌వాడీల సమ్మెకు ఐద్వా నాయకులు సంపూర్ణ మద్దతునిచ్చి ఆయా కేంద్రాల వద్ద కొవ్వొత్తులు వెలిగించి, ర్యాలీలు నిర్వహించారు. గుణదల, కండ్రిక, వాంబేకాలనీ, విజయవాడలోని ఆయా సెంటర్లతో పాటు విజయవాడ రూరల్, జిల్లా వ్యాప్తంగా కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహించారు. 13వ రోజు పలువురు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ముఖ్య నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం భేషజాలకు పోకుండా చర్చల ద్వారా అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. బెదిరింపులకు దిగి అంగన్‌వాడీల సమ్మెను విచ్ఛిన్నం చేయాలని చూస్తే వారికి అండగా నిలిచి,ఈ ప్రభుత్వానికి రాష్ట్రంలో ఉన్న కార్మికవర్గం తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. ఐదేళ్ల లోపు పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించి వారి ఆలనా పాలన గత 45 ఏళ్లుగా చూస్తున్నవారు అంగన్వాడీలని కొనియాడారు. యుటిఎఫ్ ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుందరయ్య, రాష్ట్ర కార్యదర్శి ఎస్‌పి.మనోహర్ కుమార్ మాట్లాడారు. సమ్మె శిబిరంలో అంగన్వాడీలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. లబ్ధిదారులు వారి కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమాలలో పాల్గొన్నారు. సమ్మె శిబిరంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ సుప్రజ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, సెంట్రల్ సిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కె.దుర్గారావు, ఎంవి.సుధాకర్, యూనియన్ జిల్లా అధ్యక్షులు టి.గజలక్ష్మీ, జయసీరత్నకుమారి, ఉమాదేవి, ఎల్లారాణి, యుటిఎఫ్ జిల్లా సహ అధ్యక్షులు యం.కష్ణయ్య, జిల్లా కోశాధికారి పి.నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జే. సుధానంద్, జిల్లా ఆడిట్ కమిటి కన్వీనర్ ఏ.గోపాల్ కృష్ణ పాల్గొన్నారు. **మైలవరం :** అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న సమ్మెలో భాగంగా సిఐటియు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో 13వ రోజు కూడా సమ్మె కొనసాగింది. ఈ సందర్భంగా పలువురు సిఐటియు నాయకులు మాట్లాడుతూ ఎన్ని ఇబ్బందులు ఎదురైనా తమ సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామన్నారు. కళ్ళు లేని ఈ ప్రభుత్వానికి బుద్ధి వచ్చే వరకు సమ్మె కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మైలవరం జి.కొండూరు ఇబ్రహీంపట్నం సిఐటియు మండలాల కార్యదర్శులు సిహెచ్.సుధాకర్, కె.బాలకృష్ణ, మహేష్ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు శారద, పుష్ప కుమారి, అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు. **అజిత్ సింగ్‌నగర్ :** వాంబే కాలనీ స్కూల్ సెంటర్‌లో పౌర సంక్షేమ సంఘాల రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.బాబూరావు 61 డివిజన్ 57వ డివిజన్ అంగన్వాడీలకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ 13 రోజులుగా సమ్మె చేస్తున్నా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అంగన్వాడీ సెంటర్లో వెంటనే తెరిపించి వారికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ సెంటర్లో నాశిరకం కోడిగుడ్లు ఇస్తున్నారని ప్రజల నుండి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. నాశిరకం సరుకులు ఇస్తున్నారని వాటి వల్ల పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారని స్థానికులు ఈ సందర్భంగా బాబూరావు దృష్టికి తీసుకొచ్చారు. అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు క్రిస్మస్ పండుగ రోజు కూడా రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో పౌర సంక్షేమ సంఘాల విజయవాడ సిటీ కార్యదర్శి రమణరావు, సిఐటియు సిటీ నాయకులు దుర్గారావు అంగన్వాడీ టీచర్లు కార్యకర్తలు పాల్గొన్నారు. **విస్సన్నపేట :** అంగన్వాడీ సమస్యల పరిష్కారం కోరుతూ విస్సన్నపేటలో కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం చేపట్టిన అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో విస్సన్నపేట గాంధీ బొమ్మ సెంటర్లో నిరసన వ్యక్తం చేశారు. సిఐటియు మండల అధ్యక్షులు ఆకుల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు తెలుగు మహిళా సంఘం నాయకులు నాదెళ్ల నాగమణి కెవిపిఎస్ జిల్లా నాయకులు మేకల జానారత్నం యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సిహెచ్.సూర్యనారాయణ, ఐఎఫ్‌టియు నాయకులు నాగరాజు జనసేన నాయకులు నందమూరి వెంకటేశ్వరరావు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ ఉద్యోగులు సమ్మె 13 రోజులుగా చేస్తున్న కనీసం ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా లేదని అంగన్వాడీ కేంద్రాలను తన అధికారులతో తాళాలు పగలగొట్టి అంగన్వాడీ వర్కర్స్‌ను హెల్పర్స్‌ను అవమానించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనం రిటైర్మెంట్ బెనిఫిట్స్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు గ్రావిటీ, అద్దె బకాయిలను చెల్లించాలని లేని యెడల రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో విస్సన్నపేట మండల సెక్టార్ లీడర్స్ ఎం.పద్మ సునీత శ్రీలక్ష్మి నిర్మల లక్ష్మీకుమారి రైతు సంఘం మండల నాయకులు పులి బల్ల ఏడుకొండలు చిట్టిబాబు తాపీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు అప్పారావు గంజినబోయిన రాము మురళి శ్రీనివాసరావు వార్డు నెంబర్ నెక్కలకు వెంకట్రావు జనసేన నాయకులు యాసీన్ అడప శ్రీనివాసరావు మహేష్ న్యూ డెమోక్రసీ రత్నాచారి తెలుగు మహిళా సంఘం నాయకులు పాల్గొన్నారు. **తిరువూరు :** ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరవధిక సమ్మె లో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు తిరువూరు తహాశీల్దార్ కార్యాలయం ఎదుట చేస్తున్న సమ్మెలో ఆదివారం ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఆకుల రవి, బలగాని వెంకటేశ్వరావు, యూనియన్ నాయకులు పులిచెర్ల పద్మ, శ్రీలక్ష్మి , ఝాన్సీ, సుజాత, పద్మ కుమారి ఆయాలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బోసుబొమ్మ సెంటర్లో ఆది వారం రాత్రి సిఐటియు ప్రజా సంఘాల నాయకులు కార్యకర్తలు కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ సం దర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ సిహెచ్.శ్రీనివాస్ మాట్లాడుతూ 13 రోజుల నుండి అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని నిరవధిక సమ్మె చేస్తున్న ఈ ప్రభుత్వానికి చలనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం సమస్యను పరిష్క రించి సమ్మె విరమింపచేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్ సిహెచ్ సుప్రజ, నాయకులు బి.వెంకటేశ్వరరావు, ఆకుల రవి, పంతంగి శ్రీనివాసరావు, నూకల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. **నందిగామ :** నందిగామ టౌన్‌లోని 14వ వార్డులో అంగన్వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని తల్లిదండ్రులు, పిల్లలు ఆదివారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. సమ్మెకు ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నందిగామ, చందర్లపాడు మండల శాఖ నాయకులు సంఘీభావం తెలిపారు. యుటిఎఫ్ నాయకులు బొద్దుకోలు రమణయ్య, జంగాల గంగరాజు, నందిగామ మండలం యుటీఎఫ్ అధ్యక్షులు బెనర్జీ, మహిళా నాయకురాలు శ్రీలక్ష్మి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ నాయకులు సరళ, సుజాత, వెంకట్రావమ్మ, మహాలక్ష్మి, వేణు, కాత్యాయని తదితరులు పాల్గొన్నారు.

మైలవరంలో

తిరువూరు

నందిగామ

విస్సన్నపేటలో

బిసి సంఘం అధ్యక్షునిగా రామకృష్ణ

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : ఎన్టీఆర్ జిల్లా బిసి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రెడ్డిగూడెం మండలం, రంగాపురం గ్రామానికి చెందిన రామకృష్ణ గౌడ్‌ను నియమించారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎన్.మారేష్, ఉప అధ్యక్షులు ఈతకుల జగదీష్ నియామక పత్రాన్ని రామకృష్ణకు అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ బిసిల హక్కుల కోసం, సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

మైలవరంలో బిసిల ఐక్యతా ర్యాలీ

ప్రజాశక్తి - మైలవరం : ఏపీ బీసీ సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎన్.నరేష్, కార్యదర్శి రామాంజనేయులు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పంచాయతీ కార్యాలయం నుండి గౌతులచ్చన్న విగ్రహం వరకు బీసీల ఐక్యతర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్.మారేష్ మాట్లాడుతూ విజయవాడ ఎంపీ సీటుతో పాటు జిల్లాలో రెండు నియోజకవర్గాలను బీసీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. సిఎం జగన్ ప్రభుత్వంలోనే బీసీలు ఎక్కువ శాతం లబ్ధి పొందారు అన్నారు. అనంతరం బీసీ సంఘం మైలవరం నియోజకవర్గ అధ్యక్షుడుగా ఉయ్యూరు వెంకటేశ్వరరావును నియమిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఏతాకుల జగదీష్ , రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బేబీ రాణితదితరులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ చేస్తున్న జగన్, భాను

కొరగంజి ట్రస్ట్ ఆధ్వర్యంలో చీరలు పంపిణీ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : క్రిస్మస్ పండుగ సంద ర్భంగా కొరగంజి శేఖర బాబు మెమోరియల్ ట్రస్ట్, శ్రీశైలం నగరాల కులస్తుల నిత్య అన్నదాన వసతి సత్రం ఆధ్వర్యంలో మహిళలకు చీరలు, మగవారికి విమల్ ప్యాంటు, షర్ట్‌లు, పెద్ద వయస్సు వారికి కాటన్ చీరలు అందచేశారు. ఆదివారం కొత్తపేటలోని కొరగంజి ఫంక్షన్‌హాల్ వద్ద ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మన్ కొరగంజి జగన్నాధరావు, నగర ప్రముఖులు కొరగంజి భాను, పోతిన వెంకటేశ్వరస్వామి, లింగిపిల్లి అప్పారావు, బంక అప్పారావు , కొరగంజి చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

162 మందికి బోనస్ పంపిణీ

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : పాడి రైతుల శ్రేయస్సు లక్ష్యంగా కృష్ణా మిల్క్ యూనియన్ పనిచేస్తుందని యూనియన్ బోర్డ్ డైరెక్టర్ ఉయ్యూరు అంజిరెడ్డి అన్నారు. కొత్త రెడ్డిగూడెం పాల కేంద్రంలో ఆదివారం యూనియన్ అందించిన బోనస్‌లు అంజిరెడ్డి పాల ఉత్పత్తిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022 - 23వ సంవత్సరానికి గానూ ఇప్పటివరకు యూనియన్ రెండు దఫాలుగా బోనస్ అందజేసిందని, ఆరు లక్షల 6376 రూపాయలను ఇప్పటి వరకు సభ్యులకు రెండు దఫాలుగా అందజేసినట్లు తెలిపారు. ఉయ్యూరు రామ్మోహన్ రెడ్డి, గోగులమూడి లక్ష్మారెడ్డి, కొప్పుల పుల్లారెడ్డి అత్యధికంగా పాలు పోసిన వారిలో నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు పాల ఉత్పత్తిదారులు సిబ్బంది పాల్గొన్నారు.

200 ఓట్లు తొలగింపు ?

ప్రజాశక్తి - వీరులపాడు : మండలంలో వివిధ గ్రామాల్లో ఎన్నికలు దగ్గర పడటంతో వివిధ రాజకీయ పార్టీలు గ్రామాల్లో కొత్త ఓట్లు మార్పులు, చేర్పులు పెద్ద ఎత్తున చేపట్టారు. అధికార ప్రతిపక్ష పార్టీల వారు తాము తీసుకొచ్చిన దరఖాస్తులు ఓటర్ లిస్ట్‌లో నమోదు చేయాలని అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. ముఖ్యంగా ఇదే మండలంలో పెద్దాపురం గ్రామంలో ఒక పార్టీ వారు ఈ గ్రామంలో నివసించటం లేదని వారిని ఓటర్ లిస్ట్ నుంచి తొలగించాలని రెవెన్యూ అధికారులకు మరో పార్టీ వారు విన్నవించారు. దీంతో నందిగామ డివిజన్ అధికారి దీనిపై విచారణ జరిపి బూత్ లెవెల్ అధికారులతో గ్రామంలో ఎవరు నివసించట్లేదో గుర్తించి వారు ఏ రాజకీయ పార్టీకి సంబంధించిన వారైనా తొలగించాలని కోరారు. ఆర్డిఓ ఆదేశాల మేరకు గ్రామంలో ఎన్నికల అధికారులు రాజకీయ పార్టీలతో ప్రమేయం లేకుండా విచారణ జరిపి 210 ఓట్ల వరకు తొలగించినట్లు సమాచారం. తొలగించిన వారిలో టిడిపి చెందిన 150 ఓట్లు, వైసిపికి చెందిన 61 ఓట్లు ఉన్నట్లు సమాచారం. ఒక వ్యక్తికి ఎక్కడైనా ఒక ఓటు మాత్రమే ఉండాలని రెండు ఓట్లు ఉన్నట్లు గుర్తిస్తే చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

సోచ్‌లో రెడ్‌డాట్ సేల్ ప్రారంభం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : పండుగలు, నూతన సంవత్సరం సందర్భంగా గతంలో ఎన్నడూ లేని విధంగా సోచ్ రెడ్ డాట్ సేల్‌ను ప్రారంభించినట్లు సోచ్ షోరూమ్ ప్రతినిధి రాజేష్ కుమార్ తెలిపారు. ఎం.జి.రోడ్డులోని సోచ్ షోరూమ్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆఫర్ల గురించి తెలిపారు. షోరూమ్‌లోని అన్ని రకాల ఎత్నిక్ వేర్‌లపై 50 శాతం తగ్గింపుతో అందిస్తున్నామని తెలిపారు. ఎంతో ఆసక్తికిగా ఎదురుచూస్తున్న ఈ రెడ్ డాట్ సేల్ నుండి చీరలు, సల్వార్ సూట్లు, ట్యూనిక్స్, కఫ్తాన్‌లతో సహా అన్ని వస్త్రాలపై తగ్గింపు ఆఫర్ ఉంటుందన్నారు. ఈ ప్రత్యేక విక్రయాలు నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రెడ్ డాట్ సేల్ రూ.749ల నుండి ఆఫర్లు లభిస్తాయన్నారు.

ఐదోరోజుకు సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : సమగ్ర శిక్షలోని అన్ని విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని గత ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం హామీలు అమలు చేయాలని సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (జెఎసి) జిల్లా అధ్యక్షులు పి.పోతురాజు అన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు కలక్టరేట్ ధర్నా చౌక్ లో చేపట్టిన సమ్మె ఆదివారానికి ఐదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా పోతురాజు మాట్లాడుతూ తమకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వానికి కనబడటం లేదా అని ప్రశ్నించారు. సంఘ ప్రధాన కార్యదర్శి ఎస్.శివ నాగరాజు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులందరికీ హెచ్‌ఆర్ పాలసీ, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. మినిమం టైం స్కేల్, హెచ్‌ఆర్‌ఎ, డిఎ అమలు చేసి వేతనాలు పెంచాలన్నారు. పార్ట్ టైమ్ విధానాన్ని రద్దు చేసి, ఫుల్ టైమ్ కాంట్రాక్టు విధానాన్ని అమలు చేయాలన్నారు. అలాగే ఇపిఎఫ్, ఇఎస్‌ఐ అమలు చేయాలని,డిమాండ్ చేశారు. ఈ సమ్మెకు గూడూరు మండల యుటిఎఫ్ శాఖ కార్యదర్శి కె వి ప్రసాద్ రావు సంఘీ భావం తెలిపి మాట్లాడారు. మండల అధ్యక్షులు ఎల్ వెంకటేశ్వర్లు , మరియు గూడూరు మండల యుటిఎఫ్ సభ్యులు సంఘీ భావం తెలిపిన ఈ సమ్మె లో సంఘ కోశాధికారి ఎం.ప్రశాంతి,మరియు నాగార్జున తో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉద్యోగులందరూ పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

రాయితీ విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-ఘంటసాల : ఇటీవల మిచౌంగ్ తుఫాను వల్ల పంట నష్టపోయిన రైతులకు 80 శాతం రాయితీపై మినుము, పెసల విత్తనాలను ఘంటసాల రైతు భరోసా కేంద్రం వద్ద ఆదివారం ఘంటసాల మార్కెట్ కమిటీ చైర్మన్ వేమూరి వెంకట్రావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ రెండవ పంట కొరకు రైతులు మినుములు విత్తనాలు రెండు సార్లు చల్లుకోవాల్సిన పరిస్థితులు తుపాను వల్ల ఏర్పడ్డాయని, రైతులు అధిక ధర వెచ్చించి కొందామన్నా అందుబాటులో లేని నేపథ్యంలో ప్రభుత్వం 80 శాతం రాయితీపై స్వల్పకాలిక వంగడాలను నేరుగా రైతు భరోసా కేంద్రాల ద్వారా అందజేస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. మండల వ్యవసాయాధికారి కె.మురళీకష్ణ మాట్లాడుతూ ఘంటసాల మండలంలోని 13 రైతు భరోసా కేంద్రాల ద్వారా 150 క్వింటాళ్ల మినుములు, 50 క్వింటాళ్ల పెసలు అందుబాటులో ఉంచామని, పంట నష్టం జరిగిన రైతులకు అందజేస్తామన్నారు. మినుములు పూర్తి ధర ఒక కేజీ రూ.133లకు గానూ 80 శాతం రాయితీ పోనూ రూ.27.60 గానూ, పెసలు పూర్తి ధర ఒక కేజీ రూ.117.50 గానూ 80 శాతం రాయితీ పోనూ రూ.23.50 చొప్పున యాప్ ద్వారా ఇవ్వటం జరుగుతుందన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు నకలుతో సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకుని సంప్రదించాలని ఏవో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ వేమూరి ప్రవీణ్, ఘంటసాల పిఏసిఎస్ చైర్ పర్సన్ వేమూరి రత్నశేఖర్, విఏఏ జి.రేవతి, రైతులు పాల్గొన్నారు.

మదర్ థెరిస్సా సొసైటీ సేవలు అభినందనీయం

- కృష్ణాజిల్లా ఎస్‌పి జాషువా

ప్రజాశక్తి-ఉయ్యూరు : మదర్ థెరిస్సా ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ సేవలు అభినందనీయమని జిల్లా ఎస్పీ జాషువ అన్నారు. థెరిస్సా ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆవరణలో గన్నవరం డీఎస్పీ జయసూర్య, సబ్ డివిజన్ పరిధి అధికారుల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలో ఎస్పీ పాల్గొని సొసైటీలో చిన్నారులకు నూతన దుస్తులు అందజేశారు. ఈసందర్భంగా కేక్కట్చేసి సెమీక్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ సొసైటీ చైర్మన్ జోషి చేస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. సొసైటీకి తనవంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు. డీఎస్పీ జయసూర్య, సబ్డివిజన్ అధికారులను ఆయన అభినందించారు. చిన్నారులకు భోజనం వడ్డించి ఉల్లాసంగా గడిపారు. ట్రైనింగ్ డీఎస్పీ వేద, కంకిపాడు సీఐ శ్రీనివాసరావు, సబ్డివిజన్ పరిధిలో సీఐలు, ఎస్సైలు, లయన్ క్లబ్ అధ్యక్షుడు ఇస్మాయిల్, దినవహిప్రసాద్, సుధీర్ టింబర్ డిపో అధినేత సాంబశివరావు పాల్గొన్నారు.

అధ్వానంగా నరసింహపురం-విశ్వనాధపల్లి రహదారి

గుంతలో దిగబడిన ధాన్యం ట్రాక్టర్

ప్రజాశక్తి-కోడూరు : కోడూరు మండల కేంద్రం నుంచి బయట ప్రాంతాలకు వెళ్లే రహదారులన్నీ అధ్వానంగా మారడంతో మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం నుంచి అవనిగడ్డ, నాగాయలంక, మచిలీపట్నం, విశ్వనాధపల్లి వెళ్లే రహదారులన్నీ పూర్తిగా పాడై.. "ముందు చూస్తే గొయ్యి వెనక చూస్తే నుయ్యి" అన్న మాదిరిగా తయారయ్యాయని, కనీసం ధాన్యం ట్రాక్టర్ కూడా వెళ్ళని పరిస్థితి నెలకుందని రైతులు వాపోతున్నారు. ఆదివారం విశ్వనాధపల్లి నుంచి కోడూరు ధాన్యంతో వస్తున్న టాక్టర్ నరసింహపురం-విశ్వనాధపల్లి గ్రామాల మధ్య రహదారి మధ్యలోనే దిగిపోయింది. దానిని బయటికి తీసేందుకు జెసిపి సహాయంతో వాహనదారుల నానా తంటాలు పడ్డారు. అత్యవసర పరిస్థితుల్లో హాస్పటల్ కి వెళ్లేందుకు మండల కేంద్రం చుట్టూ ఉన్న ఏ ఒక్క రహదారి కూడా బాగోలేదని మండల ప్రజలు గగోలు పెడుతున్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు తాము ఇచ్చిన హామీలు మాటలకే పరిమితం కాకుండా చేతల రూపం దాల్చే విధంగా కషి చేయాలని కోరుతున్నారు.

ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు

ఐవీఎం ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి-చల్లపల్లి : నిరుపేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న ఐవీఎం సురేష్ సేవలు ప్రశంసనీయమని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. ఆదివారం చల్లపల్లి మండలం పురిటిగడ్డలోని ఐవిఎం హోంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే రమేష్ బాబు ముఖ్య అతిథిగా విచ్చేసి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఐవీఎం డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్ ఆర్థిక సహకారంతో నిరుపేద విద్యార్థులకు నూతన వస్త్రాలు బహుకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐవీఎం ద్వారా గత 22 సంవత్సరాలుగా సురేష్ అందిస్తున్న విస్తత సమాజ సేవలు ఈ ప్రాంత పేదలకు వరంగా నిలుస్తున్నాయని తెలిపారు. ఏసుక్రీస్తు బోధించిన సమాజ సేవ అనే నినాదాన్ని ఐవీఎం సురేష్ స్ఫూర్తిగా తీసుకొని విస్తత సేవలు అందిస్తున్నారని తెలిపారు. కోవిడ్ సమయంలో ఐవీఎం ద్వారా కోట్లాది రూపాయలు వెచ్చించి ఫ్రంట్ లైన్ వారియర్లకు విస్తత సహాయం, పేదలకు నిత్యావసర సరుకులు అందచేశారని తెలిపారు.ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథి వైసీపీ రైతు విభాగం జోనల్ ఇంచార్జ్ కడవకొల్లు నరసింహారావు, అతిధులు రాజేష్, విశ్రాంత డీఎస్పీ కే.హరి రాజేంద్రబాబు, చల్లపల్లి సీఐ సీహెచ్ నాగప్రసాద్, పురిటిగడ్డ మాజీ సర్పంచ్ పరుచూరి సురేష్, సజ్జా బలరాం, ఐవీఎం ప్రతినిధులు వేములపల్లి విజయ, రోజా, సోఫీ పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకల్లో చీరలు పంపిణీ : మండల పరిధిలోని రాముడు పాలెం ఎమ్మానుయేల్ చర్చిలో పాస్టర్ ప్రభాకర రావు ఆధ్వర్యంలో శనివారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాం కిషోర్ నాయుడు 30 మందికి చీరలు పంపిణీ చేశారు.

నూతన వస్త్రాల బహూకరణ

ప్రజాశక్తి-పమిడిముక్కల : పమిడిముక్కల మండలం లోని వేల్పూర్‌లో క్రిస్మస్ సందర్భంగా మాజీ సర్పంచ్ వేల్పూర్ తిరుమల సిటీ బోసు బాబు నూతన వస్త్రాలను పాస్టర్లకు బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజా సంక్షేమంలో ముందుందని తెలిపారు. జడ్పిటిసి వేలూరు వెంకటరమణ కుమారి, మండల అధ్యక్షురాలు కాసాని సుప్రజా, మండల తాసిల్దార్ డి రాజ్యలక్ష్మి, మండల ఉపాధ్యక్షులు కొడమంచిలి మహేష్, గంజల సీతారామయ్యలు కూడా క్రిస్మస్ శుభాకాంక్షలు అందరికి తెలిపారు.

పమిడిముక్కలలో వస్త్రాలు అందిస్తున్న దృశ్యం

భార్యను హత్య చేసిన భర్త

మృతిచెందిన రామలక్ష్మి

ప్రజాశక్తి - గుడివాడ : కుటుంబ వివాదాల నేపథ్యంలో భార్య రామలక్ష్మిని ఆమె భర్త అతి కిరాతకంగా కత్తితో పొడిచి చంపిన ఘటన గుడివాడలోని ఎన్టీఆర్ కాలనీలో చోటు చేసుకుంది. ఆదివారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో రామలక్ష్మి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం ఎన్టీఆర్ కాలనీకి చెందిన రామలక్ష్మికి 5 సంవత్సరాల క్రితం భీమవరానికి చెందిన సూర్యనారాయణతో వివాహం జరిగింది. భార్యాభర్తల మధ్య విభేదాలు రావడంతో నాలుగు సంవత్సరాల నుండి కుమారుడితో తల్లిదండ్రుల వద్ద ఉంటున్న రామలక్ష్మి ఆదివారం పెద్దల సమక్షంలో మాట్లాడు కుందామని భార్య రామలక్ష్మి కుటుంబ సభ్యులు సూర్య నారాయణను పిలిచినట్లు స్థానికులు తెలిపారు. సూర్యనారాయణ ఇంటికి రావడమే రామలక్ష్మిపై కత్తితో విచక్షణ రహితంగా దాడికి పాల్పడ్డాడు. అడ్డుకోబోయిన రామలక్ష్మి తండ్రి వెంకటరమణను కూడా గాయపరిచినట్లు తెలిపారు. స్థానికులు 108 వాహనం ద్వారా గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తీసుకువచ్చే సమయానికి రామలక్ష్మి మతి చెందగా, రామలక్ష్మి తండ్రి చికిత్స పొందుతున్నాడు. కత్తితో దాడి చేసిన అనంతరం సూర్య నారాయణ తనతో తెచ్చుకున్న పురుగుల మందు తాగినట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుడ్లవల్లేరు పోలీస్‌స్టేషన్ తనిఖీ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గుడివాడ డిఎస్పీ పి.శ్రీకాంత్ వార్షిక తనిఖీలలో భాగంగా గుడ్లవల్లేరు పోలీస్ స్టేషన్ ను ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసులు త్వరితగతిన పరిష్కరించాలని, రాబోయే పండుగ సందర్భంగా కోడిపందాలు, పేకాటల శిబిరాల నిర్వహణ జరగకుండా చర్యలు తీసుకోవాలని మరియు రాబోయే ఎలక్షన్ల గురించి అందరూ బాధ్యతగా వ్యవహరించి గ్రామాలలో పట్టు సాధించాలని సిబ్బందికి, ఎస్ ఐ లకు తగు సూచనలు చేశారు. తొలుత స్టేషన్ ఆవరణలో మొక్కలను నాటారు. ఈ తనిఖీలలో గుడివాడ రూరల్ సీఐ ఏసుబాబు , ఎస్సై జి సత్యనారాయణ, ఏఎస్ఐ సిహెచ్ సారధి సిబ్బందిపాల్గొన్నారు.

ఉచిత హోమియో వైద్య శిబిరం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం మండలం లోని చిన్నా పురం గ్రామంలో ఎస్. ఎస్.బి. గ్లోబల్ వెల్ ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆది వారం ఉచిత హెూమి యో వైద్య శిభిరం నిర్వహించారు.ఈ శిభిరం లో డాక్టర్ చింతా రవీంద్ర 200 మంది రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందించారు. కరోనా విజంభిస్తున్న సందర్భంగా నివారణ కోసం ఉచిత హెూమియో మందు అందరికీ వెంటనే ఇవ్వడం జరిగింది.అంతే కాకుండా సర్వరోగ నివారిణి ఫ్యామిలీ కిట్ అందరికీ ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ నీటి సంఘం అధ్యక్షులు చలమలశెట్టి వెంకట రమణ,రాష్ట్ర చేనేత విభాగ జాయింట్ సెక్రటరీ విట్టంశెట్టి వెంకయ్య (వెంకు మాస్టార్) ముఖ్య అతిథిగా విచ్చేసి డాక్టర్ చింతా రవీంద్ర చేస్తున్న సేవకు గుర్తింపుగా దుశ్శాలువతో చిన్నాపురం ప్రజలందరి తరపున సన్మానించి కతజ్ఞతలు తెలిపారు.

క్రిస్మస్ కానుకలను పంపిణీచేస్తున్న పోతిన మహేష్ దంపతులు

క్రిస్మస్ కానుక పంపిణీ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : క్రిస్మస్ పండుగ సందర్భంగా మూడు వేల కుటుంబాలకు జనసేన పశ్చిమ ఇన్‌ఛార్జి పోతిన మహేష్ క్రిస్మస్ కానుకను ఆదివారం అందజేశారు. క్రిస్మస్ కిట్‌లో కేజీబియ్యం, కిలో గోధుమపిండి, అరకిలో బొంబాయిరవ్వ, కిలో పంచదార, 200 గ్రాముల పామాయిల్, పావుకిలో కందిపప్పు, పసుపు ఒక చిన్న ప్యాకెట్, కారం ఒక చిన్న ప్యాకెట్, ఒక చేతి సంచి అందచేశారు. ఈ కార్యక్రమంలో ఫిలడెల్ఫియా ఎజిచర్చి పాస్టర్ చార్లెస్ జాకోబ్, మరి కొంతమంది పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మహేష్ చిన్ననాటి స్నేహితుడని, మహేష్ ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేయాలని, ప్రభు కృప మహేష్‌పై ఉండాలని ఆశీర్వచనాలు ఇచ్చారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ యేసయ్య దీవెనలతో కొత్త సంవత్సరంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కాబోతుందన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

దుప్పట్లు పంపిణీ చేస్తున్న గౌతం రెడ్డి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : తాము చేస్తున్న పలు సేవా కార్యక్రమాలకు సంబంధించి ఈ నెల 29న ఢిల్లీలో పురస్కారం అందుకో బోతున్నట్లు ముత్యాలంపాడు సాయిబాబా మందిరం గౌరవాధ్యక్షుడు పి.గౌతంరెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం పేదలకు ఉచితంగా దుప్పట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 100 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం గౌతంరెడ్డి మీడియాతో మాట్లాడుతూ, గడిచిన 18 సంవత్సరాలుగా తాము అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. సామాజిక బాధ్యతగా విద్య, వైద్యం, రోజూ వందలాది మందికి నిత్యాన్నదాన కార్యక్రమాలు, గో సంరక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. కరోనా సమయంలో అందించిన సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. సాయిబాబా మందిరం ఆంధ్రా షిర్డీగా పేరుగాంచిందన్నారు. కార్యక్రమంలో కుంచనపల్లి రవి శంకర్ పాల్గొన్నారు.

మద్యం నిషేధించాలని నిరసన

నిరసన తెలుపుతున్న మహిళలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : సామాన్య ప్రజల ప్రాణాల తో చెలగాట మాడే మద్యం వ్యాపారం అవసర మా జగన్ అంటూ ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవాని ప్రశ్నించారు. ఎన్ఎఫ్ఐడబ్ల్యు విజయవాడ నగర మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మద్యాన్ని పూర్తిగా నిషేధించాలని కోరుతూ కొత్తపేట బంగారు కొట్టు సెంటర్ వద్ద ఎదురుగా వున్న ప్రభుత్వ వైన్‌షాపు వద్ద ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవాని పాల్గొని మాట్లాడుతూ జగన్ అధికారంలోకి రాగానే మద్యాన్ని అంచెలంచెలుగా నిషేధిస్తానని, కేవలం ఫైవ్‌స్టార్ హోటల్‌లోనే లభ్యమవుతుందని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ నాలుగున్నర సంవత్సరాలలో మద్యం నిషేధించకపోగా ఏరులై ప్రవహిస్తుందని ఎద్దేవా చేశారు. ఆదివారం చిట్టినగర్ వద్ద ప్రభుత్వం నిర్వహిస్తున్న మద్యం షాపును ప్రత్యక్షంగా పరిశీలించగా స్పిరిట్‌తో తయారుచేసిన, జగన్ బ్రాండ్లు చీప్ లిక్కర్ విపరీతంగా అమ్ముతున్నట్లు గుర్తించామని తెలిపారు. గతంలో రూ.30లు ఉండే బ్రాండ్లు నేడు రూ.130 నుండి రూ.150 పైనే అమ్ముతున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో అన్ని మద్యం షాపులను ప్రత్యక్షంగా పరిశీలించి, సర్వేలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మద్యాన్ని నిషేధించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య నగర అధ్యక్ష, కార్యదర్శులు ఓర్సు భారతి, పంచదార్ల దుర్గాంబ, అనసూయ, కృష్ణవేణి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు నగర ఉపాధ్యక్షులు బోయి సత్యబాబు

కార్మికులతో సమావేశమైన యూనియన్ నాయకులు బోయి సత్యబాబు, జ్యోతిబసు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని సిఐటియు నగర ఉపాధ్యక్షుడు బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో డిసెంబర్ 26 నుండి జరుగుతున్న నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం 53వ డివిజన్ మున్సిపల్ కార్మికుల జనరల్ బాడీ సమావేశం చేపల మార్కెట్ మాస్టర్ పాయింట్ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నగర అధ్యక్షులు జ్యోతిబసు, సిఐటియు నగర ఉపాధ్యక్షులు, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో ప్రాణాలను పణంగా పెట్టి పనిచేసిన మున్సిపల్ కార్మికుల త్యాగాలను ప్రభుత్వం గుర్తుపెట్టుకోకుండా వారి పట్ల ఇష్టమొచ్చినట్లు వ్యవహరించటం సరికాదన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను మర్చిపోకుండా అమలు చేయాలని ఐదు సంవత్సరాలుగా కోరుతున్నా పట్టించుకోకుండా గత ప్రభుత్వంలా మోసం చేయడం తగదని అన్నారు. కార్మికుల సమ్మె కారణం ఈ ప్రభుత్వమేనని, ప్రజలు ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ఖండించి కార్మికుల యొక్క సమ్మెకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. యూనియన్ నాయకులు సాంబశివరావు, ఆదిలక్ష్మి పద్మ పాల్గొన్నారు.

42వ డివిజన్‌లో 'భవిష్యత్‌కు గ్యారంటీ'

మహిళలతో మాట్లాడుతున్న రామయ్య

ప్రజాశక్తి - భవానీపురం : పశ్చిమ నియోజకవర్గంలోని 42వ డివిజన్‌లోని 38వ సెంబర్ బూత్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి భవిష్యత్‌కు గ్యారెంటీ నమోదు కార్యక్రమాన్ని పర్యవేక్షించిన ఎన్టీఆర్ జిల్లా మీడియా కో-ఆర్డినేటర్, మాజీ కార్పొరేటర్ యేదుపాటి రామయ్య, డివిజన్ పరిధిలో గడపగడపకు వెళ్లి వారి యొక్క సమస్యలు తెలుసుకుంటూ టిడిపి, జనసేన ప్రభుత్వం ఇచ్చే పథకాల గురించి వివరిస్తూ వారి యొక్క వివరాలను నమోదు చేసుకున్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు యేదుపాటి రామయ్య మాట్లాడుతూ నారా చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్, బాలకృష్ణ ఒకే వేదికపై నుంచి ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకే కోసం ప్రజలకు ఇచ్చే పథకాలు, రానున్న రోజుల సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించినట్లు తెలిపారు. రానున్నది టిడిపి, జనసేన ప్రభుత్వమన్నారు.

కృష్ణదేవరాయ శాసనం లభ్యం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : శ్రీకృష్ణ దేవరాయల శాసనం పల్నాడు జిల్లా అటవీ ప్రాంతంలో మరుగునపడి ఉందని పురావస్తు పరిశోధకుడు ప్లీచ్ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. మొగల్‌రాజపురంలోని మధుమాలక్ష్మి ఛాంబర్స్‌లో ఆదివారం ఉదయం విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాచర్లకు చెందిన వారసత్వ కార్యకర్త సతీష్ పావులూరి ఇచ్చిన సమాచారం మేరకు పల్నాడు జిల్లా మాచర్ల మండలం కొప్పునూరు వద్ద అటవీ ప్రాంతంలో ఉన్న గుండాల శిథిలాలయం వద్ద భూమిలో కూరుకుపోయిన క్రీస్తుశకం 1516 నాటి నాపరాతిపై చెక్కిన తెలుగు శాసనాన్ని పరిశీలించినట్లు తెలిపారు. ఆ శాసనంలో శ్రీ కృష్ణ దేవరాయలు కొండవీడు, నాగార్జున కొండలను జయించి పాలిస్తుండగా, ఆయన ప్రధాని తిమ్మరుసు చేత, నాగార్జున కొండ గురించి చెప్పిన అంశాలు శాసనంలో ఉన్నాయని తెలిపారు. ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ శాసనాన్ని కొప్పునూరుకు తరలించి భద్రపరచాలని కోరారు. పురావస్తు శాసనాలను భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేలా చూడాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. ఈ సమావేశంలో దుర్గంపూడి యగ్నాథ్‌రెడ్డి, రమేష్ ఉప్పుతోళ్ల, శ్యామ సుందరరావు పాల్గొన్నారు.

కెబిఎన్ కృషి అభినందనీయం: వెలంపల్లి

కెబిఎన్ కళాశాలలో చదువు చెప్పిన గురువును సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు, కళాశాల యాజమాన్యం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఎందరినో తీర్చిదిద్ది కృషిచేసిన వన్‌టౌన్ కొత్తపేటలో గల కాకరపర్తి భావనారాయణ కళాశాల (కెబిఎన్) అభ్యున్నతికి ఆ కళాశాల పూర్వ విద్యార్థులందరూ అండగా ఉండాలని పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు, ఆ కళాశాల పూర్వ విద్యార్థి వెలంపల్లి శ్రీనివాసరావు కోరారు. కేబీఎన్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆ కళాశాల ప్రాంగణంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన పూర్వ విద్యార్థులు సమావేశంలో పాల్గొని తమ అనుభూతులను, గత స్మృతులను పంచుకొని ఉబ్బితబ్బిబ్బి య్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ముఖ్యఅతిథిగా హాజరైన వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ తాను హిందూ హైస్కూల్స్ కమిటీ ఆధ్వర్యంలోని హిందూ హైస్కూల్లో విద్యను, కెబిఎన్ కళాశాలలో కళాశాల విద్యను అభ్యసించానన్నారు. కెబిఎన్ కళాశాల గడిచిన 58 సంవత్సరాలుగా అద్వితీయమైన ప్రగతిని అందిపుచ్చుకుని అభివృద్ధిపథంలో ముందుకు సాగుతుందన్నారు. జిల్లాలోనే అత్యధిక విద్యార్థులు కలిగిన కళాశాలగా ఘనతకెక్కిందన్నారు. రానున్న కాలంలో మరిన్ని కార్యక్రమాలను నిర్వహించాలని అందుకు తాను భాగస్వామినవుతానని వివరించారు. ఇస్రో శాస్త్రవేత్త కళాశాల పూర్వ విద్యార్థిని జల్లూరి తాయారమ్మ, కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు తొమ్మండ్రు శేషయ్య, తూనికుంట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ కళాశాల పాలకవర్గంగా పూర్వ విద్యార్థుల విజయాలను తెలుసుకొని పొంగిపోతున్నామన్నారు. హిందూ హైస్కూల్స్ కమిటీ ప్రధాన కార్యదర్శి గోపిశెట్టి మల్లయ్య మాట్లాడుతూ తాను హిందూ హైస్కూల్, కెబిఎన్ కళాశాలల్లో హైస్కూల్, ఉన్నత విద్యను పూర్తి చేశానన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పిఎల్ రమేష్ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. ఈ కార్యక్రమాన్ని కళాశాల అధ్యాపకులు డాక్టర్ జేవీ చలపతిరావు, వి. శేషగిరిరావులు నిర్వహించారు.

నీరందదు... బియ్యమూ రావు...

బియ్యం పంపిణీ వ్యాను

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మున్సిపాలిటీ పరిధిలో 14, 16వార్డుల్లో 10 రోజులకు పైగా మంచినీళ్లు రాక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్యాంకర్ల ద్వారా మంచినీరు వచ్చినా అరకొరగా అందుతున్నాయని నిత్యావసరాలకు వాడుకోవటానికి మంచినీళ్లు దొరకని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు అడిగితే పైప్‌లైన్లు మరమ్మతులు మోటార్ రిపేర్లు అని ఏదో సాకు చెబుతున్నారని స్థానిక కౌన్సిలర్ పట్టించుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఈ నెలలో రావాల్సిన రేషన్ సరుకులు కూడా ఇంతవరకు తమకు అందలేదని అదేమని డీలర్లు అడిగితే కోటా అయిపోయిందని అంటున్నారని సరుకు సరిపడా రాలేదని, పక్క వార్డులో ఎక్కువ తీసుకున్నారని చెబుతున్నారని వచ్చే నెలలో ఇస్తామని చెబుతున్నారని తెలిపారు. రేషన్ బియ్యం మీద ఆధారపడి బతికే కుటుంబాలు పెరిగిన ధరలకు అనుగుణంగా కేజీ 60 రూపాయలు 70 రూపాయలు పెట్టి కొనాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు కల్పించుకొని మంచినీరు, రేషన్ సౌకర్యం కల్పించాలని 14వ వార్డు ప్రజలు కోరుతున్నారు.

జనవరి 1న 2 నెలల బియ్యం ఇస్తాం : తహశీల్దార్

నందిగామ తహశీల్దారు నరసింహారావు మాట్లాడుతూ నందిగామలో రేషన్ బియ్యం అందని వారికి జనవరి 1వ తేదీన రెండు నెలలు కలిపి ఇస్తామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ జయరాం మాట్లాడుతూ మంచినీరు అందని వారికి ట్యాంకర్ల ద్వారా పంపిణీ చేస్తామని తెలిపారు.

నగర పంచాయతీ కార్యాలయం

రేషన్ బియ్యానికి బదులు డబ్బులు

నందిగామ రెవెన్యూ డివిజన్ పరిధిలో రేషన్ బియ్యం అక్రమ రవాణా అడ్డూ అదుపు లేకుండా పోతుంది. కొంతమంది బియ్యం లేదంటూ డబ్బులు పంచుతున్నారు. ప్రభుత్వం కార్డుదారులకు కేజీ రూపాయికే అందిస్తున్న బియ్యాన్ని కార్డుదారుల వద్ద 8 నుండి పది రూపాయల చొప్పున కొనుగోళ్లు చేస్తున్నారు. కేజీకి నాలుగు రూపాయల లాభం చూసుకుని హోల్ డీలర్లకు అమ్ముకుంటున్నారు. పబ్లిక్‌లో రేషన్ అక్రమాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అక్రమ వ్యాపారం వెనుక కొంతమంది అధికార పార్టీ నాయకులున్నారని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో తెల్లరేషన్ కార్డులు 5,73,072 ఉండగా, అంత్యోదయ అన్న యోజన (ఎఎవై) కార్డులు 23,056 ఉన్నాయి. ఎఎవై కార్డులకు 35 కేజీల బియ్యం పంపిణీ చేస్తున్నారు. 374 ఎండియు వాహనాలు ద్వారా సుమారు 12 వేల టన్నుల చౌక బియ్యం ప్రతి నెల సరఫరా చేస్తున్నారు. నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో 1900 టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నారు. కొంతమంది రేషన్ డీలర్లు, ఎండియు ఆపరేటర్లు కుమ్మక్కై కార్డుదారులకు బియ్యం బదులు డబ్బులు ఇస్తున్నారు. బియ్యం పంపిణీ చేసినట్లు వేలిముద్రలు వేయించుకుంటున్నారు. బియ్యం హోల్‌సేల్ వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. హోల్‌సేల్ వ్యాపారులు కొందరు అధికారులు, ముఖ్య నాయకులను ప్రసన్నం చేసుకుంటూ అక్రమ వ్యాపారానికి అడ్డూ అదుపు లేకుండా చేసుకుంటున్నారు. అక్రమ రేషన్ బియ్యం వ్యాపారంపై ఎవరైనా ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. హోల్‌సేల్ వ్యాపారులు రేషన్ బియ్యం కోళ్ల ఫారాల్లో దాణాకు, కాకినాడ పోర్టుకు లారీలలో తరలించి అక్రమ సంపాదనకు పాల్పడుతున్నారు.

అటు అలసత్వం...ఇటు నిర్లక్ష్యం

డ్రైన్లలో పెరిగిన జమ్ము

నీరు పారుదల లేక మునిగిన వరిపంట

- డ్రైన్లలో గుర్రపుడెక్క, జమ్ముాలతో ముందుకు పారని నీరు
- నీరు నిల్వాతో పూర్తిగా దెబ్బతిన్న పంటలు

ప్రజాశక్తి-పెడన : అధికారుల అలసత్యం, నాయకుల నిర్లక్ష్యం కారణంగా రైతన్నలకు భారీ నష్టం వాటిల్లింది. అసలే అంతంత మాత్రంగా వ్యవసాయాన్ని నెట్టుకొ స్తున్న వారి పరిస్థితి మూలికేనకపై తాటికాయ పడ్డ చందంగా తయారైంది. ఏళ్ల తరబడి మురుగు కాలువ లోని తుడు, గురబాడెక్కు, జమ్మూలను తొలగించక పోవడంతో రైతుల పాలిట శాపంగా మారింది. ఫలితంగా దాదాపు 200 ఎకరాల్లోనికి పంట నీటమునిగింది. మండల పరిధిలోని పెనుమల్లి, నేలకొండపల్లి, కూడూరు,పుల్లపాడు గ్రామాల్లోని పంట పొలాలు మురుగునీరు వెళ్లే డ్రైనేజీ గత రెండున్నర మూడు సంవత్సరాలుగా పూడికలు తీయకపోవడంతో ఈ పరిస్థితి దాపురించిందని రైతులు పేర్కొంటున్నారు. గత మూడేళ్ల నుంచి గుర్రపు డెక్క,జమ్మూ లతో మురుగు కాలువ పేరుకుపోయింది. ఈ డ్రైనేజీకి ఆనుకుని 600 ఎకరాలు వ్యవసాయం సాగవుతుంది. ఇటీవల మిచాంగ్ తుఫాను కారణంగా ఈ పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. తుఫాన్ కు రెండు రోజులు ముందే కోతల కోసి వరి పనుల మీద ఉన్న దాదాపు 150 ఎకరాలు మొలకలు వచ్చాయి. దీనివలన సన్న, చిన్న కారు రైతన్నలకు అపార నష్టం వాటిల్లింది. గత రెండు మూడేళ్లుగా ఆయా గ్రామాల రైతులు మురుగు కాల్వలోని జమ్ము, చెత్తను తొలగించాలని పలుమార్లు గ్రామస్థాయి సమావేశంలో అధికారులు చెప్పిన ఫలితం లేదని రైతుల వాపోతున్నారు. తుపాను వల్ల పంటనష్టం దాదాపు 5కోట్ల 40లక్షలు వరకు నష్టం వాటిల్లిందని రైతులు బోరును వినిపిస్తున్నారు అంతేకాకుండా కోసిన వరి పొలాల్లో మినుము విత్తనాలు చల్లామని, అవి కూడా మురుగునీరు కింద ఉన్న లజ్జబండ కాలువలోకి వెళ్లకపోవడంతో మొక్కలు పూర్తిగా చచ్చిపోయాయని, మళ్లీ రెండోసారి విత్తనాలు వేసేమని రైతులు చెబుతున్నారు. దీనిపై ఎకరానికి రైతుకు 5500 రూపాయల నుంచి నుంచి 6000 రూపాయల వరకు అదనపు ఖర్చు అవుతుందని రైతులు పేర్కొంటున్నారు.

మూడేళ్ల నుంచి మురుగు కాలువ పూడిక సమస్యలను చెబుతూనే ఉన్నాం
రైతు, చిల్లి ముంత నాగరాజు, పుల్లపాడు

నేలకొండపల్లి, పెనుమల్లి, పుల్లపాడు పంచాయతీలో ఏప్పుడు నాయకులు, అధికా రులు గ్రామ సభలు పెట్టిన ప్పుడల్లా ఈ మురికి కాలవలోని తూడు, గుర్రపు డెక్కు, జమ్ములను తొలగించి లజ్జబండ డ్రైనేజీ వరకు బాగు చేయాలని చెప్పాము. అయితే ఏ ఒక్కరు పట్టించుకోకపోవడంతో రైతులకు ఈ పరిస్థితి దాపురించింది. మున్ముందు వీటిని మరమ్మతులు చేయకపోతే వ్యవసాయం చేయడానికి రైతు ముందుకు రాడు.

20 సెంట్లు పంట మాత్రమే చేతికొచ్చింది.
రైతు, బోట్ల కోటేశ్వరరావు పెనుమల్లి

డ్రైనేజీనానుకుని నాకు ఎకరం 20 సెంట్లు భూమి ఉంది. దీనిలో వరి పంట వేశాను. అందులో ఎకరం కోత కోసి 15 రోజులు గడిచిన తేలక పోవడంతో, నాతో పాటు మరో ఇద్దరు కూలీలు వేసుకుని వరి పనులు తొక్కి మినుము విత్తనాలు చల్లాను మిగిలిన 20 సెంట్లు మాత్రమే వరిపనాలను రోడ్డుపైకి తీసుకొచ్చి ను ఈ ఏడాది తిండికి ఇవే.

కాల్వలకు మరమ్మతులు జరగలేదు.
జిల్లా టిడిపి రైతు సంఘం అధ్యక్షులు గోపు సత్యనారాయణ

వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏర్పడిన ఈ నాలుగున్నర ఏళ్ల నుండి పంట కాలువలు, మురుగు కాలువలు ఎక్కడ తవ్విన దాఖలాలు లేవు. పేరుకు మాత్రమే రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటుంది కానీ ఏ కాలువలో మురుగు తీశారు ఒక్క రైతుకైనా చెప్పగలరా.

న్యాయవాదుల దీక్షకు ఐఎంఎ మద్దతు

ప్రజాశక్తి - గుడివాడ : న్యాయవాదులు చేస్తున్న నిరాహార దీక్షకు ఐఎంఎ, మానవతా మద్దతు తెలియజేశారు. గుడివాడ న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారం 7వ రోజుకు చేరుకుంది. స్థానిక ఏలూరు రోడ్ లోని కోర్టు సముదాయముల ముందు చేపట్టిన రిలే నిరాహార దీక్షకు మానవత జిల్లా అధ్యక్షులు పొట్లూరి శేషగిరిరావు, కన్వీనర్ ఉప్పలపాటి మారుతి ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు శిష్లా దత్తు, గుడివాడ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మల్లిపూడి చక్రవర్తిలు సంఘీభావం తెలియజేశారు. అనంతరం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ లయన్స్ క్లబ్ ఆఫ్ గుడివాడ ప్రగతి తరపున రూ.3000లు వితరణగా డాక్టర్ భవాని శంకర్ అందించారు. ఈ దీక్షలో న్యాయవాదులు వై రవీంద్రనాథ్, వై విజయ భాస్కర్ రావు, అన్నే నవీన్, బి సత్య సూర్య వరప్రసాద్, ముప్పిరి సురేంద్రబాబు కష్ణరాజు, వైవి కష్ణారావులు పాల్గొని నిరసన తెలియజేశారు.

డోకిపర్రులో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని డోకిపర్రు గ్రామంలోని మహా క్షేత్రంలో వేంచేసి ఉన్న శ్రీ భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవ స్థానంలో అష్టమ సాలకట్ల బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఆలయ నిర్వాహకులు కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ, ప్రసన్న ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఉత్సవాల ప్రారంభ సూచకంగా ఆలయంలోని ఉత్సవ మూర్తులకు వేద పండితులు విశేష స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఉత్సవాల తోలి రోజు స్నపన తిరుమంజనం, సేనాధిపతి ఉత్సవం, అంకురారోపణ, వాహనం (తిరుచ్చి), పల్లకీ సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు, డోకిపర్రు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కలెక్టర్, ఎస్పి క్రిస్మస్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) :క్రిస్మస్ పండుగని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు ,జిల్లా ఎస్పీ పి జాషువా లు జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. త్యాగం, ప్రేమ, కరుణ గొప్పతనాన్ని ఏసు క్రీస్తు తన బోధనలు ద్వారా విశ్వ మానవాళికి తెలియ చేసారన్నారు. క్రీస్తు అనుసరించిన మార్గం ఎంతో ఆదర్శమన్నారు. యేసుక్రీస్తు ప్రపంచ సర్వమత శాంతి స్థాపన కొరకు పుట్టిన మహనీయుడు, గొప్ప శాంతి దూతన్నారు. శత్రువులను సైతం క్షమించమని చెప్పిన కరుణామూర్తి యేసు క్రీస్తు అని తెలిపారు. ఆయన చూపిన శాంతి మార్గంలో పయనించేలా ప్రతి ఒక్కరూ కషి చేయాలని సూచిం చారు. కృష్ణాజిల్లాలోని క్రైస్తవ సోదర సోదరీమణులు అందరూ క్రిస్మస్ వేడుకలను ఘనంగా, ఆనందోత్సాహల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షించారు.

టిడిపితోనే అభివృద్ధి సాధ్యం : మైనేని

ప్రజాశక్తి-పమిడిముక్కల : నందమూరి తారక రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీ పేదల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన పార్టీ అని కష్ణాజిల్లా తెలుగు మహిళా అధికార ప్రతినిధి మైనేని ఇందిరా అన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ పమిడి ముక్కల మండలం గోపువానిపాలెంలో మాట్లాడుతూ నారా చంద్రబాబునాయుడు పేదల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేశారన్నారు. తెలుగుదేశం పార్టీలో మహిళలకు అధిక ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. మండలంలోని లంకపల్లి, తాడంకి, గ్రామాల్లో తెలుగుదేశం నాయకులతో త్వరలో సమావేశాలు జరుపుతామని తెలిపారు. వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇసుక మాఫియా, మద్యం మాఫియా ప్రభుత్వమని విమర్శించారు.

క్రిస్మస్ అంటే ది స్పిరిట్ ఆఫ్ గివింగ్

- కలెక్టర్ సతీమణి పి.సుజాతా రాజాబాబు

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : క్రిస్మస్ అంటే కేవలం బహుమతులు అందుకోవడమే కాదని, అవతలి వారికి కొంతైనా ప్రేమను దయను పంచి ఇవ్వడంలో ఆనందం అమితంగా ఉంటుందని దీనినే ' ది స్పిరిట్ ఆఫ్ గివింగ్ ' అంటారని జిల్లా కలెక్టర్ సతీమణి పి. సుజాతా రాజాబాబు పేర్కొన్నారు. ఆదివారం ఆమె స్థానిక ఫోర్టు రోడ్డులో గల జిల్లా స్త్రీ , శిశు సంక్షేమ శాఖకు చెందిన బాలసదనంలో సెమి క్రిస్మస్ వేడుకలలో ముఖ్యఅతిథిగా పాల్గొని చిన్నారులతో కొద్దిసేపు గడిపారు. ఈ సందర్భంగా పి .సుజాతా మాట్లాడుతూ పిల్లలకు చిన్ననాటి నుంచే దాతృత్వం, దయ ప్రాముఖ్యతను తెలియచేయాలని స్త్రీ , శిశు సంక్షేమ శాఖ బాల సదనం సిబ్బందికి తెలిపారు. కల్లా కపటం తెలియని చిన్నారులకు మీరు ఇచ్చే సంరక్షణ ప్రేమ క్రిస్మస్ నిజమైన స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందన్నారు. క్రీస్తు సూచించిన శాంతి, కరుణ, ప్రేమ మార్గాలను అనుసరించడం ద్వారా ఉన్నతంగా జీవించగలమన్నారు. అనంతరం వారు చిన్నారుల మధ్య కేకుని కట్ చేసి స్వయంగా పిల్లలకు తినిపించారు. ఈ కార్యక్రమంలో ఐసిడి ఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్. సువర్ణ, సిడిపిఓ గ్లోరీ, బాల సదనం ఇంచార్జ్ మ్యాట్రిన్ స్వరాజ్య లక్ష్మి, ఈ ఓ, విజయలక్ష్మి, అకౌంటెంట్ ఎన్ వి తనూజా తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు కేక్ తినిపిస్తున్న పి.సుజాతారాజాబాబు

ప్రభుత్వ స్థలాల ఆక్రమణను అడ్డుకోవాలి : టిడిపి

ప్రజాశక్తి కలక్టరేట్,(కష్ణా) : ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు అధికారులు అడ్డుకోవాలని లేదంటే టిడిపి ఆధ్వర్యంలో నగర పాలక సంస్థ ను మరియు కలక్టరేట్ ముట్టడి కార్యక్రమం చేపడతామని పలువురు టిడిపి నాయకులు హెచ్చరించారు. మచిలీపట్నంలోని 25వ డివిజన్లో ఉన్న గుమ్మటాల చెరువు కబ్జాకు గురవుతుందని అనేకసార్లు జిల్లా కలెక్టర్ కి ,ఆర్డిఓ, మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేసిన ప్రభుత్వ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టుకపోవడంతో కబ్జాదారులు శనివారం రాత్రి దాదాపు పాతిక గుడారాలు కొత్తగా ఏర్పాటు చేసి చెరువును ఆక్రమించేశారని తెలుగుదేశం పార్టీ నాయకులు ఆరోపించారు. ఆక్రమణకు గురైన గుమ్మటాల చెరువును ఆదివారం మచిలీపట్నం టిడిపి నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ చైర్మన్ ఎం వి.బాబా ప్రసాద్,పార్టీ పట్టణ అధ్యక్షులు ఇలియాస్ పాషా టిడిపి మాజీ కౌన్సిలర్ బొడ్డు శ్రీను లు మాట్లాడుతూ రాత్రికి రాత్రి గుమ్మటాల చెరువులో పదుల సంఖ్యలో వేలసిన గుడారాలు వేసి ఆక్రమణలకు పాల్పడుతున్న అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదన్నారు. ప్రభుత్వ భూమిని కాపాడవలసిన అధికారులే అవినీతికి తలొగ్గి భూ కబ్జాదారులకు సహకరిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పిప్పళ్ళ కాంతారావు, కార్పొరేటర్లు అన్నమానంద్, రాళ్ల కొట్టు రాము, దేవరపల్లి అనిత, దింటకుర్తి సుధాకర్ పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి ఆలయ నూతన సంవత్సర 2024 క్యాలెండర్లను ధర్మకర్తల మండలి చైర్మన్ శేషం వీర వెంకట కష్ణమూర్తి ఆలయ కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు ఆధ్వర్యంలో గుడివాడ శాసన సభ్యులు కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు (నాని) చేతుల మీదగా ఆయన కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమములో ట్రస్టీ కొమ్మనబోయిన రవి శంకర్ గారు, వైసిపి నాయకులు పాలేటి చంటి, గొర్ల శ్రీను గారు పాల్గొన్నారు. ఆదివారం నుండి శ్రీ అమ్మవారిని సుమారు 20వేల మంది భక్తులు దర్శించుకొని శ్రీ అమ్మవారికి పాలపొంగళ్ళు సమర్పించి వారి యొక్క మొక్కుబడులు తీర్చుకున్నారు.

కేలండరు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఆడుదాం ఆంధ్ర క్రీడా సంబరాలకు సర్వం సిద్ధం : జెసి

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ నెల 26న ఆడుదాం ఆంధ్ర క్రీడోత్సవాలను ప్రారంభించనుందని.. ఈ క్రీడా సంబరాలను జిల్లాలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ తెలిపారు. ఆదివారం విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం, చిట్టినగర్ ప్రాంతంలో విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్ర ర్యాలీ శాతవాహన కళాశాల నుంచి శిఖామణి సెంటర్ వరకు జరిగింది. దాదాపు 2000 మంది హాజరైన ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా. పి.సంపత్ కుమార్, విజయవాడ సెంట్రల్ శాసనసభ్యులు మల్లాది విష్ణు, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 26వ తేదీ నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకు జిల్లాలోని 605 సచివాలయాల పరిధిలో పోటీలు జరగనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 10వరకు నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా క్రీడోత్సవాన్ని సమష్టి కృషితో విజయవంతం చేసేందుకు పటిష్ఠ ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడాన్ని జీవనశైలిలో భాగంగా చేసుకునేందుకు, మట్టిలో మాణిక్యాలను వెలికితీసి ప్రోత్సహించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఆడుదాం ఆంధ్రా క్రీడోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని 605 సచివాలయాల పరిధిలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ క్రీడలతో పాటు స్థానిక ప్రాధాన్యమున్న క్రీడలకు సంబంధించిన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి క్రీడాకారుల రిజిస్ట్రేషన్, మైదానాల ఎంపిక, టీమ్ ఫార్మేషన్, స్పోర్ట్స్ కిట్ల పంపిణీ తదితర ప్రక్రియలు పూర్తయినట్లు వివరించారు. ఏడ పోటీలకు 225 మైదానాలు సిద్ధం చేసినట్లు తెలిపారు. గ్రామ, వార్డు స్థాయిలో క్రీడా పోటీలపై ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. క్రీడల నిర్వహణకు ప్రత్యేక అధికారులను కూడా నియమించినట్లు తెలిపారు. క్రీడాపోటీలను విజయవంతం చేయడం ద్వారా ఆడుదాం ఆంధ్రాలో జిల్లాకు గుర్తింపు తీసుకొచ్చేందుకు అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో లక్ష 16 వేల మంది క్రీడల పోటీలకు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు వెల్లడించారు. ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో పోటీలను విజయవంతం చేసేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. ర్యాలీలు వంటి ప్రత్యేక కార్యక్రమాల ద్వారా క్రీడల పోటీలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ వెల్లడించారు. రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ శాసనసభ్యులు మల్లాది విష్ణు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గౌరవ ముఖ్యమంత్రి మార్గదర్శకాలకు అనుగుణంగా దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆడుదాం ఆంధ్రా క్రీడోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో క్రీడారంగంలో మట్టిలో మాణిక్యాలను వెలికి తీసి వారిని ప్రోత్సహించేందుకు ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. క్రీడల ప్రాధాన్యాన్ని గుర్తించి క్రీడాకారులను ప్రోత్సహించేందుకు విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో డిఎస్డిఒ అజీజ్, కళాశాల విద్యార్థులు, క్రీడాకారులు, విజయవాడ నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

తుది దశకు ఎన్యుమరేషన్

మొక్కజొన్న, మినుములు, వేరుశనగ, జొన్న, పత్తి తదితర పంటలు దెబ్బతిన్న వాటిల్లో ఉన్నాయి. తొలుత మిచౌంగ్ తుపాను ప్రభావం వల్ల 169 గ్రామాల్లో 5వేల హెక్టార్లు దెబ్బతిని ఉండొచ్చని ప్రాథమికంగా అంచనా వేశారు. దీనిలో 4876 హెక్టార్లలో వరి, 98 హెక్టార్లలో శనగ, 6 హెక్టార్లలో పెసర, 16హెక్టార్లలో కందులు, 15 హెక్టార్లలో మొక్క జొన్న, 30 హెక్టార్లలో జొన్న, మరో 10 హెక్టార్లలో మినుము పంటలు నష్టం జరిగి ఉండొచ్చని అంచనా లెక్కలు వేశారు. కానీ క్షేత్ర స్థాయిలో ఎన్యుమరేషన్ చేపట్టిన అనంతరం అంచనాలు తారుమారయ్యాయి. దాదాపు రెట్టింపు సంఖ్యలో హెక్టార్లలో పంట నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. ఇదిలా ఉంటే నష్ట పోయిన వారిలో కౌలు రైతులే అధికంగా ఉన్నారు. వర్షాభావ పరిస్థితులను అధికమించి అప్పులు చేసి మరి సాగు చేపడితే చివరికి కన్నీటిని మిగ్గిందని కౌలు రైతులు వాపోతున్నారు. మరో వైపు కౌలు రైతుల పేరుతో కాకుండా భూ యజమానుల పేరుతో ఈక్రాప్ నమోదు నమోదు చేశారని, దీంతో నష్ట పరిహారం కూడా తమ ఖాతాల్లో కాకుండా భూ యజమానుల ఖాతాల్లోనే జమ చేస్తారేమోనని కౌలు రైతుల్లో ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి.

గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత

పని చేసే హెల్పర్లు, ఉపాధి హామీ పథకాల్లో పనిచేసే వారికి డిజిటల్ అక్షరాస్యత కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నాం. దీనిలో సెల్‌ఫోన్‌లో యాప్‌లు, లావాదేవీలు నిర్వహించడంపై శిక్షణ ఇస్తున్నాం.

ప్రశ్న: వెనుకబడిన ఎస్‌టిలకు ఆర్థికంగా చేయూత అందుతోందా?

ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. గృహ నిర్మాణ పథకంలో భాగంగా ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలోని 60 యానాదుల కుటుంబాల లబ్ధిదారుల వాటాను గిరిజన సంక్షేమశాఖ ద్వారా చెల్లించాం. మొత్తం రూ. 37 లక్షల 77 వేలు లబ్ధిదారులకు అందింది. పాడైపోయిన ఇళ్ల మరమ్మతులకు 218 మంది లబ్ధిదారులకు రూ. 1 కోటి 10లక్షల 35 వేలు అందించాం. ఇతర సంక్షేమ పథకాల్లో 35 మంది లబ్ధిదారులకు రూ. 55 లక్షల 17 వేలు మంజూరయ్యాయి. పామర్రు మండలంలో ఇళ్లు కాలిపోయిన ఘటనలో నష్టపోయిన నాలుగు గిరిజన కుటుంబాలకు రూ. 1 లక్ష 27 వేలు మంజూరు చేశాం. 18 మంది ఎస్‌టి నిరుద్యోగులకు ఏపిఎస్ ఆర్టీసీలో డ్రైవింగ్ శిక్షణకు రూ. 5 లక్షల 17 వేలు మంజూరు చేశాం. 335 మంది ఎస్‌టి లబ్ధిదారులకు జిల్లాలో 2 కోట్ల 13 లక్షల 71 వేల ఆర్థిక సాయం అందింది.

ప్రశ్న: ఎస్‌టిల్లో ఆధార్ కార్డులు లేని వారు ఉన్నారా?

కొన్ని ప్రాంతాల్లో ఆధార్ కార్డులు తీసుకోలేదు. వారికి సంక్షేమ పథకాలు అందే పరిస్థితి ఉండదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని గిరిజన సంక్షేమశాఖ ద్వారా ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేశాం. జిల్లాలో 40 ఎస్‌టి కుటుంబాల్లో 100 మందికిపైగా గిరిజనులకు ఈ ఏడాది ఆధార్ నమోదు చేయించాం.

ప్రశ్న: దాడులకు గురైన ఎస్‌టిలకు ప్రభుత్వ సాయం అందుతోందా?

గిరిజనులపై దాడులు జరిగితే ఎట్రాసిటీ కేసులు నమోదవుతాయి. ఎట్రాసిటీ కేసుల్లో బాధితులుగా ఉండే ఎస్‌టిలకు ప్రభుత్వం ఆర్థికంగా చేయూత నిస్తుంది. కలెక్టర్ అధ్యక్షతన ఉండే కమిటీ నిర్ణయం మేరకు బాధితులకు సాయం అందించడం జరుగుతోంది.

క్రిస్మస్‌కు చర్చిలు ముస్తాబు

సెయింట్ పాల్స్ విచారణకర్తలు ఫాదర్ ముప్పల ప్రసాద్ తదితర ఫాదర్స్ ఘనంగా క్రిస్మస్ వేడుకలను ప్రారంభించి సమిష్టి దివ్య పూజాబలి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన క్రిస్మస్ గీతాలు అలరించాయి. గుణదలలోని మేరిమాత ఆలయంలో కూడా ప్రత్యేకంగా ప్రార్థనా కార్యక్రమాలను నిర్వహించి హాజరైన వారికి ఆశీర్వచనాలు అందచేశారు.



ట్రాఫిక్ డిసిపిగా చక్రవర్తి

ప్రజాశక్తి-విజయవాడ: నూతన ట్రాఫిక్ డిసిపిగా కె చక్రవర్తి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలో ఎస్.పి.(నాన్ క్యాడర్)ల సాధారణ బదిలీలలో భాగంగా తిరుపతి రెడ్ శాన్డిల్ యాంటి స్మగ్లింగ్ టాస్క్ ఫోర్స్ ఎస్.పి. గా విధులు నిర్వహిస్తున్న కె.చక్రవర్తి ఎన్.టి.ఆర్ జిల్లా ట్రాఫిక్ డి.సి.పి.గా బదిలీ అయ్యారు. ట్రాఫిక్ డి.సి.పి. కార్యాలయంలో కె.చక్రవర్తి డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్)గా బాధ్యతలను స్వీకరించారు. అనంతరం పోలీస్ కమిషనర్ వారి కార్యాలయంలో నగర పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటాను మర్యాదపూర్వకంగా కలిశారు.

నేడు విఎంసిలో స్పందన రద్దు

ప్రజాశక్తి-విజయవాడ: సోమవారం విఎంసిలో జరగాల్సిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ సోమవారం క్రిస్మస్ పండుగ సందర్భంగా విఎంసికి సెలవు ఉన్నందున, స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కమిషనర్ తెలిపారు. విఎంసి ప్రధాన కార్యాలయంతో పాటు మూడు సర్కిల్స్ కార్యాలయాల్లో జరగాల్సిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేయడం జరిగిందన్నారు.

క్రీస్తు బోధనలు ఆదర్శనీయం : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ: నిస్వార్థమైన ప్రేమతో ప్రతి ఒక్కరిని ఆదరించాలన్న ఏసుక్రీస్తు బోధనలను అనుసరిస్తూ ఆనందమయ జీవితం గడపాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు జిల్లా ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లావ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు వైభవంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ క్రిస్మస్ పర్వదిన ప్రాశస్త్యాన్ని వివరించారు. క్రిస్మస్ పండుగ సమయంలో దానధర్మాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. నిస్వార్థంగా ఎవరైతే దేవునికి సేవ చేస్తారో వారికి ఏసుక్రీస్తు ఆశీస్సులు లభిస్తాయన్నారు. ఏసుక్రీస్తు పుట్టిన పవిత్రమైన రోజున పేద ప్రజలకు దానం చేయడం వంటి గొప్ప కార్యక్రమన్నారు.పవిత్రమైన క్రిస్మస్ రోజున పేదలను ప్రేమతో ఆదుకోవడం ద్వారా ఏసుక్రీస్తు అనుగ్రహం లభిస్తుందని, జీసస్ వరాల జల్లు కురిపిస్తాడనే క్రైస్తవ సోదరుల విశ్వాసం బైబిల్లో కూడా పేర్కొనబడిందని తెలిపారు. జిల్లా ప్రజలు జీసస్ ఆశీస్సులు పొంది సుఖసంతోషాలతో జీవించాలని జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని కోరుతూ కలెక్టర్ ఢిల్లీరావు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు .

ఫుట్‌పాత్ పనులు పూర్తి చేయాలి : కమిషనర్

ప్రజాశక్తి-విజయవాడ: నిర్దేశించిన గడువు లోగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం, స్మృతివనం పనులను పూర్తి చేయాలని నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం, స్మృతి వనం నిర్మాణ పనులతో పాటు ఫుట్‌పాత్ పనులను కమిషనర్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... ఒక వారంలో నాణ్యత ప్రమాణాలతో ఫుట్‌పాత్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. స్వరాజ్ మైదానంలో నిర్మాణం అవుతున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్మృతి వనం పనులు వేగవంతం చేయాలని. జనవరి 20 కల్లా పనులను పూర్తి చేసి, ప్రజలకు అందుబాటుకు తీసుకురావాలని ఆదేశించామన్నారు.ఈ కార్యక్రమంలో ఇ.ఇ ఎస్ఎన్ ప్రసాద్ పాల్గొన్నారు.

BEFORE THE HON'BLE TELANGANA STATE CONSUMMER DISPUTES REDRESSAL COMISSION AT: HYDERABAD

F.A.NO. 588 OF 2023

BETWEEN:

Sri.Pulimamidi Varrae Peer Kumar ...Petitioner/Appellant

And

M/s.Radha Krishna Automobiles PVt Ltd &others ...Respondents/Opp.parties

To,

1 .M/s.Radha Krishna Automobiles PVt Ltd, Situated at Plot No.A-5, ward no.7, Block No.2, Sanathnagar Main Road,Hyderabad-18. Rep.by its Managing Director and CEO M.V.Srinivas.

2. M.V.Srinivas ,Managing Director and C.E.O of M/s.Radha Krishna Automobiles Pvt Ltd, Occ:Business, R/o 5-10, Beside A.P.Seeds Crporation,Prasadampadu National Highway No.5,Vijayawada, Krishna District, Andhra Pradesh-521108.

3. M/s Toyota Kirloskar Motor Pvt Ltd, No.24,10 th Floor,Canberra Block,Vittal Mallya Road,Bangalore,Karnataka-560001,rep.by its M.D & C.E.O Masakazu Yoshimura

...Respondents/Opp.parties, (1,2,4)

Please take notice that the above named Appellant/Petitioner filed the above F.A against you. As the summons in the above case were returned un served for you at the above mentioned address, the Hon'ble State consumer disputes Redressal commission ordered this Publication as substitute of service to the summons. Hence you are here by informed that the F.A stands posted to 02-02-2024 for your appearance and to file counters if any. In case you fail to attend before the above court on 02-02-2024 at 10-30 A.M., you may set ex-party and the matter will be decided on merits.

(BY ORDER OF COURT)

B.Narsimhulu, Advocate
H.No.7-01-309/
42,B.K.Guda,S.R.Nagar,
Hyderabad. Cell No.9399915369

అంగన్వాడీల కొవ్వొత్తుల ప్రదర్శనలు

మచిలీపట్నంలో...

అవనిగడ్డలో...

బంటుమిల్లిలో...

కంకిపాడులో...

మొవ్వలో...

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : హామీలు అమలు చేసే వరకు పోరాటం ఆపేది లేదని అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.రమాదేవి స్పష్టం చేశారు. అంగన్వాడి కార్యకర్తలకు జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలక్టరేట్ ధర్నా చౌక్ లో చేపట్టిన సమ్మె ఆదివారానికి 13 వ రోజుకు చేరుకుంది. ఈ సమ్మెలో సెక్టార్ అధ్యక్ష కార్యదర్శులు నాంచారమ్మ , రెజీనా రాణి ,లక్ష్మి, అంజలి, విజయశ్రీ , సీతారత్నం, రత్నకుమారి, సుజాత, సౌజన్య, స్వర్ణలత. పలువురు అంగన్వాడి కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-బంటుమిల్లి :** బంటుమిల్లిలో ఐసిడిఎస్ కార్యాలయ ముందు ధర్నా నిర్వహించారు. తదనంతరం ఒంటి కాలుపై నిలబడి నిరసన తెలపారు. సిఐటియు మండల కార్యదర్శి మాజేటి శివశ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరీశెట్టి నాగేశ్వరరావుచ పాల్గొన్నారు. పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల అంగన్వాడి వర్కర్స్ ఆయాలు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం :** నందామయ్యా గురుడ నందమయ్య.. జగన్ మనసు మారాలయ.. అంగన్వాడీ వేతనాలు పెంచా లయ్య అంటూ.. గన్నవరంలో అంగన్వాడీలు హరిదాసు వేషంలో పాటలు పాడుతూ నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా కార్యదర్శి కళ్ళం వెంకటేశ్వరరావు, సిఐటియు ఉంగుటూరు మండల కార్యదర్శి కడవకొల్లు రామరాజు, అంగన్వాడి సంఘం నాయకులు రమాదేవి, సాంబ, శాంతా, హిమ కుమారి, సిఐటియు నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు, బేతా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల పరిధిలోని బుద్ధవరం గ్రామంలో ఆదివారం రాత్రి అంగన్వాడీలు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. అంగన్వాడీలకు మద్దతుగా గ్రామస్తులు పిల్లల తల్లిదండ్రులు హాజరయ్యారు. **ప్రజాశక్తి-కంకిపాడు :** కంకిపాడు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ వద్ద అంగన్వాడీలు నిర్వహిస్తున్న రిలే దీక్షలకు సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు యు. త్రిమూర్తులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్షులు నళిని కుమారి, ఎం రేవతి, సెక్టార్ లీడర్ ఈ రమాదేవి, సిహెచ్ విజయలక్ష్మి, ఎం కనకరత్నం పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు రిలే దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం నాయకులు బండి ఆదిశేషు ధోని సహదేవుడు పాల్గొని సంఘీభావం తెలిపారు. అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకులు నిర్మల జ్యోతి, ఏ నాగమణి, గాదె సుశీల, కే కాశీ, హంస, కె పాములమ్మ ,ఎం సుధారాణి, పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మొవ్వ :** మొవ్వ క్లస్టర్‌లో అంగన్వాడీలు నిర్వహిస్తున్న సమ్మెకు పలువురు ఉపాధ్యాయులు సంఘీభావం తెలిపారు. ఫ్యాప్టో జిల్లా కార్యదర్శి ఇ .వి. రామారావు, పి. రమేష్, కె.శివ నాగరాజు, ఎం. శ్రీనివాస్ రావు, బి .మాణిక్యాలరావు , మొహమ్మద్ ఇంతియాజ్ , ఎస్ .ఎస్. నెహ్రూలాలతో పాటు పలువురు ఉపాధ్యాయులు అంగన్వాడీలకు రూ 6,000లు ఆర్థిక తోడ్పాటు నందించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కరీముల్లా, ప్రాజెక్ట్ అధ్యక్ష, విజయలక్ష్మి, కోశాధికారి సిహెచ్. గంగాభవాని తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. **ప్రజాశక్తి చల్లపల్లి :** చల్లపల్లి ప్రధాన సెంటర్లో ఆదివారం కొవ్వొత్తుల నిర్వహించారు. ఏపీ అంగన్వాడి వర్కర్స్ యూనియన్ మొవ్వ ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్, గంగాభవాని ఎస్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వామపక్ష నేతలు ప్రజా సంఘ నాయకులు పాల్గొని మాట్లాడారు. అనంతరం సంఘీభావం తెలిపారు. సంఘీభావం తెలిపిన వారిలో యద్దనపూడి మధు సిపిఎం మండల పార్టీ, కార్యదర్శి, వాకా రామచంద్రరావు సీనియర్ జిల్లా పార్టీ నాయకులు, సిఐటియు మండల కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా యుటిఎఫ్ మండల అధ్యక్షులు ఉప్పాల నాంచారయ్య,అడ్డాడ ప్రసాద్ సిపిఐ జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు, ఏఐఎఫ్టియు జిల్లా నాయకులు సిహెచ్ సుధీర్, ఉపాధ్యాయ నాయకులు కైతేపల్లి దాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మీర్ రిజ్వాన్, నాయకులు కొండవీటి భాస్కరరావు మాజీ ఎంపీటీసీ సభ్యులు బల్లారపు బాబురావు, రైతు సంఘం అవనిగడ్డ నియోజకవర్గం రైతు సంఘం, అధ్యక్షులు అట్లూరి వెంకటేశ్వరరావు ఉప్పల నాంచారయ్య, ఉప్పల సాంబశివరావు విశ్రాంత ఉద్యోగి దాసి సీతారామరాజు ఉన్నారు. **ప్రజాశక్తి-ఉంగుటూరు :** ఉంగుటూరు మండలంలో ఉంగుటూరు, తేలప్రోలు, పెద్ద అవుటపల్లి, చాగంటిపాడు, తరిగొప్పల తో పాటు వివిధ గ్రామాల్లో కొవ్వొత్తులతో స్థానిక అంగన్వాడీ కేంద్రాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. సిఐటియు ఉంగుటూరు మండల కార్యదర్శి కడవకొల్లు రామరాజు మాట్లాడారు. నాయకులు నాగవల్లి,సాంభ,వనజ, సత్యవతి పాల్గొన్నారు.

ఉంగుటూరులో..

చల్లపల్లిలో...

యువజన విభాగం అధ్యక్షునిగా బాలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అవనిగడ్డ మండల యువజన విభాగం అధ్యక్షులుగా చింతలపూడి బాల భాస్కరరావు (బాలు) నియమితులయ్యారు. బాల భాస్కర్‌రావు గతంలో శ్రీలంకమ్మ అమ్మవారి టెంపుల్ చైర్మన్‌గా పనిచేశారు. తాజాగా యువజన విభాగం మండల అధ్యక్షుడిగా నియమించడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, కష్ణ గుంటూరు ఎన్టీఆర్ జిల్లాల రైతు విభాగం జోనల్ ఇంచార్జ్ నరసింహారావుకి బాలు హదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలు నిబద్ధతతో నిర్వహిస్తానని తెలిపారు.

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నంలో హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో నిరాశ్రయులను దుప్పట్లు పంపిణీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. బస్టాండ్,రైల్వేస్టేషన్, చిలకలపూడి ,పాండురంగ స్వామి గుడి, కోనేరు సెంటర్ లక్ష్మి టాకీస్ సెంటర్, జిల్లా కోర్టు సాయిబాబు గుడి ప్రాంతంలో చలిలో వణుకు తూనిద్రపోతున్న నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ను రవి , పి. వి. ఫణి కుమార్, హెల్త్ అండ్ వెల్త్ కోచ్ ఎల్ ఎన్ గోరంట్ల ప్రసాద్ టౌన్ నాయకులు వేముల మధు లు ప్రారంభించారు. హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండర్ ,మరీదు శివరామకష్ణ , రాష్ట్ర అధ్యక్షురాలు ఆరేపల్లి స్వాతి పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత

ప్రజాశక్తి ఘంటసాల : మండల పరిధిలోని దేవరకోట గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దేవరకోట ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వేమూరి కష్ణమూర్తి, సి.మల్లిఖార్జున శర్మ పుస్తకాలు, పెన్సిళ్లు, డ్రాయింగ్ బుక్స్, ఎగ్జామ్ ప్యాడ్స్, కాపీ రైటింగ్ బుక్స్, పెన్నులు ఆదివారం అందజేశారు.విద్యాభివద్ధికి దాతలు అందిస్తున్న సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మద్దాల వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయిని సాయి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ కాంతులు

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఏసుక్రీస్తు జన్మదినమైన డిసెంబర్ 25 క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకొని అవనిగడ్డ మండలంలోని క్రైస్తవ ఆలయాలు రంగరంగ వైభవంగా ముస్తాబయ్యాయి. సీతా లంకలోని ఆర్.సి.యం చర్చ్‌నీ విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రధాన రహదారి పక్కన ఉన్న సిలువ ప్రాంతాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో ఆకట్టుకునే విధంగా అలంకరించారు. అదేవిధంగా మండల పరిధిలోని మోదుమూడి గ్రామంలో గల ఆర్.సి.యం చర్చి ఎదుట పశువుల పాకను అలంకరించడం తోపాటు భారీ నక్షత్రాన్ని ఏర్పాటు చేశారు. అదేవిధంగా మండలంలోని కొత్తపేట బందలాయి చెరువు వేకనూరు గ్రామాలలోని ఆర్సిఎం చర్చిల తో పాటు పలు క్రైస్తవ ఆలయాలు క్రిస్మస్ వేడుకలకు ముస్తాబు చేశారు.

ఐడి కార్డులు అందజేత

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ నియోజకవర్గ పరిధిలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్లు ఐడి కార్డులను మాజీమంత్రి ఎమ్మెల్యే కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు నాని పంపిణీ చేశారు. ఆదివారం కోకన్వీనర్లకు పార్టీ కేంద్ర కార్యాలయం నుండి వచ్చిన ఐడికారులను రాజేందర్ నగర్ లోని ఆయన స్వగహంలో కొడాలి నాని అందజేశారు. అనంతరం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా అధికారిక పెజ్ అయిన జగనన్న కనెక్ట్ కంటెంట్స్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కష్ణా జిల్లా కో కన్వీనర్ తోట రాజేష్, గుడివాడ నియోజకవర్గ కన్వీనర్ కర్రె చిన్ని, కో కన్వీనర్ రవి, పట్టణ వైసిపి అధ్యక్షులు గొర్ల శ్రీను, వైసిపి నాయకులు పాలేటి చంటి తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఎకు పలు జాతీయ పురస్కారాలు

ప్రజాశక్తి-విజయవాడ : ఐఎంఎ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శాఖ గత సంవత్సర కాలంగా చేసిన వైజ్ఞానిక ,సామాజిక, సాంస్కతిక, క్రీడా కార్యక్రమాలకు ఐఎంఎ జాతీయ పురస్కారాలు ప్రకటించారు. ఈ అవార్డులను ఈనెల 27వ తేదీ తిరువనంతపురంలో జరగనున్న 98వ ఐఎంఎ జాతీయ సదస్సులో ఇవ్వనున్నారు. ఉత్తమ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్.జి.రవికష్ణ,ఉత్తమ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డాక్టర్. పి.ఫణి ధర్ లకు,జాతీయ వైద్యుల క్రీడల నిర్వహణకు గాను డాక్టర్. ఎం. రవీంద్రనాథ్, డాక్టర్. తుమ్మల కార్తీక్ లకు,ఉత్తమ ప్రాంతీయ శాఖ కార్యదర్శి అవార్డులు కాకినాడ ఐఎంఎ కార్యదర్శి డాక్టర్. సి.కిరణ్, విజయవాడ ఐఎంఎ కార్యదర్శి డాక్టర్. పి.వి. దుర్గారాణి లకు, మహిళలలో క్రీడల ప్రోత్సాహానికి నంద్యాల కు చెందిన డాక్టర్ లక్ష్మీ సౌజన్యకు,గ్రామీణ వైద్య సేవలకు తిరుపతి ఐఎంఎ శాఖకు,జాతీయ ఐఎంఎ అధ్యక్షుల ప్రశంసా పురస్కారం విశాఖపట్నంకు చెందిన డాక్టర్. మురళీమోహన్ కు, తిరుపతికి చెందినడాక్టర్.యుగంధర్ కు ప్రకటించారు. ఆంధ్ర ప్రదేశ్ ఐఎంఎ కు పలు జాతీయ పురస్కారాలు రావడం పట్ల ఐఎంఎ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్. శ్రీహరి రావు, డీన్ డాక్టర్ రమేష్,ఐఎంఎ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్. ఎం. జయ చంద్ర నాయుడు, మాజీ అధ్యక్షులు డాక్టర్. జి.రవికష్ణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్. ఫణి ధర్ , పలువురు మాజీ ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు హర్షం ప్రకటించి పురస్కార గ్రహీతలకు అభినందనలు తెలిపారు.

పార్థసారధికి ఘన సన్మానం

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం పట్టణానికి చెందిన కసినికోట.పార్థ సారథి హైదరాబాద్ లో విజ్ఞాన్ ఇన్స్టిట్యూట్ సివిల్ డిపార్ట్మెంట్ లో అసిస్టంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తూ ఇటీవల కాలంలో అగార్తల కు చెందిన ఎన్.ఐ.టి లో ప్రొఫెసర్ దియారి తుంగ్బై నేతత్వంలో సివిల్ డిపార్ట్మెంట్ లో అన్‌రీన్‌ఫోర్స్డ్ మరియు రీన్‌ఫోర్స్డ్ కంప్రెస్డ్ స్టెబిలైజ్డ్ ఎర్త్ బ్లాక్‌లు మరియు గోడలపై పరిశోధనలు అంశంపై పీహెచ్. డి. విద్యను పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం గన్నవరం లో చర్చ్ ఆఫ్ ది లివింగ్ గాడ్ మినిస్ట్రీస్ మందిరంలో పాస్టర్ ఎన్. జోసెఫ్ రాజు అధ్వర్యంలో చర్చ్ సభ్యుల మధ్య ఘనంగా సన్మానించారు. సంఘ పెద్దలు విక్టర్ బాబు,పులి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎంఎల్ఏ విష్ణు క్రిస్మస్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-విజయవాడ : శాంతి, దయ, కరుణ, ప్రేమ ప్రపంచానికి చాటి చెప్పిన ఏసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని సెంట్రల్ నియోజకవర్గ ప్రజలందరికీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రేమ భావాన్ని, సేవాతత్పరతను బోధించిన క్రీస్తు జన్మదినం క్రైస్తవులకు అత్యంత సంతోషకరమైన రోజు అని పేర్కొన్నారు. . ప్రతిఒక్కరూ సహనం, ప్రేమ కలిగి ఉండాలని పేర్కొన్నారు.

ముస్తాబైన చర్చిలు

ఎన్‌టిఆర్ జిల్లా వ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలకు అన్ని ప్రాంతాల్లోని చర్చిలు ముస్తాబయ్యాయి. ఆదివారం సాయంత్రం నుండే క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తుండటంతో క్రైస్తవ సోదరులు వేడుకలు చేసుకునేందుకు సిద్ధమయ్యారు. రంగు రంగుల లైటింగ్, క్రిస్మస్ ట్రీ, శుభాకాంక్షల ఫ్లెక్సీలు, స్టార్‌లతో చర్చిలు కళకళలాడుతున్నాయి.

పలుచోట్ల సెమీ క్రిస్మస్ వేడుకలు
మరికొన్ని చోట్ల ప్రత్యేక ప్రార్థనలు

ప్రజాశక్తి - మైలవరం : మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బాలయోగి నగర్‌లోని మెట్రోపాలిటన్ మిషన్ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మదర్ థెరిసా ట్రస్ట్ అధ్యక్షురాలు మాట్లాడుతూ మానవ మనుగడకు ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమన్నారు. ప్రభు మార్గంలో ప్రతి ఒక్కరు ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. పాస్టర్ ప్రకాష్ ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి దాతల సహకారంతో వృద్ధులకు చీరలు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్, శ్రీ బాలా తిరుపతి తదితరులు పాల్గొన్నారు. **రెడ్డిగూడెం :** క్రిస్టమస్ పర్వదినం సందర్భంగా మండల పరిధిలోని అన్ని చర్చీలు సుందరంగా అలంకరించ బడ్డాయి. రంగు రంగుల విద్యుత్ దీపాలతో, అందమైన అలంకరణ వస్తువులతో చర్చీలను అలంకరించి సోమవారం జరిగే క్రిస్మస్ వేడుకలకు క్రైస్తవులు సిద్ధమవుతున్నారు. **కంచికచర్ల :** క్రిస్టియన్ పండుగను పురస్కరించుకుని కంచికచర్ల మండలంలో పలు చర్చిలు ముస్తాబయ్యాయి. ఆదివారం కంచికచర్ల చెవిటికల్లు రోడ్డులో గల ఆర్‌సిఎం, సిఎస్‌ఐ చర్చిలను స్టార్ లతో అలంకరించారు. చర్చిలకు రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించి ముస్తాబు చేశారు. ఆదివారం అర్ధరాత్రి వరకు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాత్రి జాగారం చేశారు. క్రిస్టియన్ కేక్ కటింగ్ చేశారు. ప్రతి ఇంటి బయట లైటింగ్‌తో స్టార్‌లు ఏర్పాటు చేశారు. కీసర, గండేపల్లి, పరిటాల, గని ఆత్కూరు, కొత్తపేట, ఎస్ అమరవరం, వేములపల్లి తదితర గ్రామాల్లో చర్చిలను అలంకరించారు. పండుగ సందర్భంగా ఆదివారం కంచికచర్లలో వస్త్ర, రెడీ మేడ్, ఫ్యాన్సీ, పచారీ, కిరాణా దుకాణాలు వినియోగదారులతో కిటకిటలాడాయి. **ఎడ్యుకేషన్ :** క్రీస్తు జననం మానవాళికి మహోదయం, రక్షణవరమని విజయవాడ కథోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు, కృష్ణా గోదావరి అధ్యక్ష ఖండం సిఎస్‌ఐ బిషప్ టి.జార్జి కొర్నేలియస్ అన్నారు. బెంజిసర్కిల్ వద్ద గల సెయింట్ కతెడ్రల్ చర్చిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. క్రిస్మస్ అనగా మన ప్రభువైన యేసుక్రీస్తు జన్మదినమని అన్నారు. సాక్షాత్తూ దేవుడు తన ఏకైక కుమారుని ఈలోకానికి పంపిన శుభదినం, పర్వదినం క్రిస్మస్ అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే గొప్ప మహోత్సవం క్రిస్మస్ అన్నారు. ఈ సందర్భంగా ఆర్‌సిఎం బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు, సిఎస్‌ఐ బిషప్ జార్జి కోర్నేలియస్ ఉమ్మడి కృష్ణా జిల్లా, నగర ప్రజలకు, క్రైస్తవులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. **విజయవాడ :** సత్యనారాయణపురంలోని భాష్యం విద్యా సంస్థలో క్రిస్మస్ సంబరాలు ఘనంగా నిర్వహించారు. నర్సరీ చదువుతున్న చిన్నారులు శాంతాక్లాజ్ వేషధారణలో ఆనందంతో నృత్యాలు చేశారు. జెడ్ఇఒ అరుణ మాట్లా డుతూ అన్ని సర్వ మతాల సారమూ ఒక్కటేనని, సర్వ మానవ సమానత్వమే క్రిస్మస్ అని పిల్లలకు సందేశమి చ్చారు. అందరూ సంతోషాలను పంచుకోవడమే క్రిస్మస్ పండుగ అని ప్రధానోపాధ్యాయురాలు భార్గవి అన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విజయవాడ హెచ్‌బి కాలనీలోని షారోన్ చర్చ్ రంగురంగుల విద్యుద్దీపాలతో పశువుల పాక, స్టార్‌తో అలంకరించారు. **నందిగామ :** పాస్టర్ రేగండ్ల సోయాన్ రాజా సిస్టర్ రేగండ్ల ప్రియాంక రాజా సర్వజనులకు ప్రార్థన మందిరం నందిగామ ఆధ్వర్యంలో శనివారం గాంధీ సెంటర్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. క్రిస్మస్ తాత ప్రత్యేకంగా ఆకట్టుకున్నారు. క్రీస్తు బోధనలు ప్రజలకు అవసరం అని దైవజనుడు పాస్టర్ సోయాన్ రాజా తెలిపారు. పట్టణ పురవీధులలో ప్రత్యేక జీపు జాతా నిర్వహించారు.


కంచికచర్లలో

నందిగామలో...

విజయవాడలో హెచ్‌బి కాలనీలో

విజయవాడ భాష్యం స్కూల్లో

విజయవాడలో ఫాదర్లు

మైలవరంలో దుప్పట్లు పంపిణీ

గోద్రెజ్ ఆగ్రోవెట్ ఆధ్వర్యంలో అవగాహన

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : కిసాన్ దివాస్ సందర్భంగా ప్రముఖ వ్యవసాయ ఉత్పత్తుల కంపెనీ గోద్రెజ్ ఆగ్రోవెట్ ఆధ్వర్యంలో రైతు అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సంస్థ మార్కెటింగ్ హెడ్ సునీల్.కె. తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన వివరాలను తెలియచేశారు. ప్రజలకు ఆహారం అందించడంలో మన రైతులు పోషిస్తున్న సమగ్ర పాత్రను గుర్తించడానికి వివిధ కార్యక్రమాలు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. భారతీయ రైతులు ఏవిధంగా అభివృద్ధి సాధిస్తున్నారనే దానిపై ప్రత్యేకంగా బ్రాండ్ ఫిల్మ్‌ను కూడా రూపొందించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. అంతేకాకుండా కిసాన్ సే హమ్ హై పేరుతో రైతులకు సత్కారం నిర్వహించనున్నట్లు తెలిపారు.

వి ప్రీ పెయిడ్ ప్యాక్ విడుదల

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రముఖ టెలికాం ప్రొవైడర్ వి తమ ప్రీపెయిడ్ కస్టమర్లకు రూ.3199లతో కొత్త వార్షిక ప్రీపెయిన్ రీఛార్జి ప్యాక్‌ను పరిచయం చేసినట్లు వి షోరూమ్ ప్రతినిధి కె.ఈశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. పండుగలు, శుభ కార్యాలు సందర్భందా వినియోగదారులు ఎక్కువ సేపు సేవలను పొందేలా వి సరికొత్తగా ప్యాక్‌లను అందుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు. ఇందులో భాగంగా ప్రీ పెయిడ్ కస్టమర్లు రోజుకు రూ.9లు కంటే తక్కువ ఖర్చుతో ఏడాది పొడవునా సౌకర్యవంతమైన కనెక్టివిటీని వినోదాన్ని పొందొచ్చని తెలిపారు. ఈ ప్లాన్ రోజుకు 2జిబి డేటా, అపరిమిత్ కాల్స్‌తో పాటు రోజకు 100 ఎస్ఎంఎస్‌లు కూడా అందిస్తుందని తెలిపారు. ప్రీపెయిడ్ వినియోగదారులు అమెజాన్ ప్రైమ్ ద్వారా వీడియో సబ్‌స్క్రైబ్ పొందవచ్చని తెలిపారు.

నాగుమోతు రాజాకు నియామకపత్రం అందిస్తున్న పాలడుగు వెంకటేశ్వరరావు, నాదెళ్ళ కష్ణ, యలమంచిలి వరప్రసాద్

కృష్ణా జిల్లా లారీ ఓనర్స్ నూతన కార్యవర్గం

విజయవాడ : విజయవాడలోని ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ నూతన పాలకవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రధాన ఎన్నికల అధికారి పాలడుగు వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2024-2026 సంవత్సరానికి అసోసియేషన్ అధ్యక్షులుగా రాజా నాగుమోతు, ఉపాధ్యక్షులుగా కాజ వెంకట సత్యచలపతిరావు, కుచ్చర్లపాటి సత్యనారాయణరాజు ప్రధాన కార్యదర్శిగా అల్లాడ వీరవెంకట సత్యనారాయణ, కార్యదర్శులుగా రావి శరత్ బాబు, చెన్నుపాటి వినయ్, కోశాధికారిగా పొట్లూరి చంద్రశేఖరరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలియజేశారు.

మేయర్, డిప్యూటీమేయర్ క్రిస్మస్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మీ, నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డిప్యూటీ మేయర్లు బెల్లందుర్గ, అవుతు శ్రీశైలజ, ఎపిఐడిసి చైర్‌పర్సన్, కార్పొరేటర్ బండినాగేంద్ర పుణ్యశీల నగర ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం వారు వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేస్తూ క్రిస్మస్ అంటే సేవ, శాంతి, సంతోషమని ఏసుక్రీస్తు క్షమా, ప్రేమ, శాంతి, కరుణ భావం కలిగిన వారు అని అన్నారు. ఏసు తన జీవితం ద్వారా మంచి మార్గంలో ఎలా నడవాలో చూపించారని అన్నారు. ప్రజలందరూ క్రిస్మస్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని, ప్రజలందరూ వారి కుటుంబ సభ్యులు ప్రేమానురాగాలతో సంతోషాలను అందరికీ పంచాలని వారు కోరారు. అలాగే కృష్ణలంక 22వ డివిజన్ కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి, 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణిమూర్తి తదితరులు క్రిస్మస్‌శుభాకాంక్షలు తెలిపారు.

మహాయాగంలో పాల్గొన్న పెందుర్తి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు నివాసంలో మూడు రోజులుగా వేద పండితులు శ్రీనివాసాచార్యుల వారి పర్యవేక్షణలో 40 మంది రుత్వికులతో అత్యంత వైభవంగా జరుగుతున్న మహా చండీయాగం, హోమ క్రతువు, సుదర్శన నారసింహ హోమం, పూర్ణహుతి కార్యక్రమంలో నారా చంద్రబాబు నాయుడు ఆహ్వానంతో కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొనటం తన అదృష్టంగా భావిస్తున్నట్లు టిడిపి రాష్ట్ర కార్యదర్శి, విజయవాడ పశ్చిమ నియోజకవర్గం బీసీ నాయకులు పెందుర్తి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా నారా చంద్రబాబు నాయుడు, భువనేశ్వరిలను కలిసి ఆశీస్సులు అందుకోవటం సంతోషంగా ఉందని, రాష్ట్ర శ్రేయస్సు మన బిడ్డల భవిష్యత్ కోసం జరిగిన మాహా యాగ క్రతువులో తనకు కుటుంబ సమేతంగా పాల్గొనే అవకాశం కల్పించిన నారా చంద్రబాబు నాయుడికి, ఎం.పి కేశినేని శ్రీనివాస్ (నాని)కి పెందుర్తి శ్రీనివాస్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

చంద్రబాబు, భునేశ్వరితో పెందుర్తి శ్రీనివాస్ దంపతులు

దుర్గమ్మను దర్శించుకున్న ఎన్నికల ఉప కార్యదర్శి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి, దుర్గమ్మను కేంద్ర ఎన్నికల ఉప కార్యదర్శి సంతోష్ అజ్మీరా ఆదివారం శ్రీ అమ్మవారి ఆలయానికి విచ్చేశారు. ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వీరికి వేదపండితులు వేదాశీర్వచనం చేయగా ఆలయ అధికారులు శ్రీ అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం మరియు చిత్రపటం అందజేశారు.

దుర్గగుడి కళావేదికపై విదేశీ వనిత నత్యార్చన

శ్రీ దుర్గా మల్లేశ్వరుల సన్నిధిలో ధర్మపదంలో భాగంగా దుర్గగుడి కళా వేదికపై ఆదివారం సింగపూర్‌కు చెందిన (62) సంవత్సరాల, మెడికల్ థెరపిస్ట్ - (వివియన్ లై సియు పింగ్) భరత నత్య ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది.. పుష్పాంజలి, జతి స్వరం, సరస్వతి కతి, దీవి కీర్తనం అంశాలకు సింగపూర్‌లో స్థిరపడిన తెలుగు నత్య గురువు సీతారావమ్మ నత్య దర్శకత్వంలో అభినయం చేశారు. 2014 నుండి నత్య సాధన చేస్తూ, ఇండియాలో మొదటి ప్రదర్శన విజయవాడ శ్రీ కనక దుర్గమ్మ వారి సన్నిధిలో ప్రదర్శన చేయటం ఎంతో ఆనందంగా ఉందని ఆమె తెలిపారు. ఈ అవకాశం కల్పించిన ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఆలయ కార్యనిర్వహణాదికారి కె.ఎస్.రామారావుకు విదేశీ నత్య కళా కారిణి, నత్య గురువు ధన్యవాదములు తెలిపారు.

అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

దుర్గగుడి కళావేదికపై నృత్యార్చన చేస్తున్న విదేశీ వనిత

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం
పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...
మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218
విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.